ఆంధ్ర విద్యార్థి యువజన మాసపత్రిక



ఆంధ్రరాష్ట్ర విద్యార్థి

నవయుగ

యువజన మాసపత్రిక

సంపుటి 1 1947 డిశంబరు సంచిక 10

★ సంపాదకీయం

విద్యార్థి ఉద్యమంపై నిర్బంధవిధానం

నేడు ఆంధ్రవిద్యాలయాలలో ఎటు జూచినా విద్యార్థులలో తీవ్ర అశాంతి కనిపిస్తుంది. కనీస పౌరసత్వహక్కుల రక్షణకు అనేక [illegible]లు కొనసాగింపబడుతున్నాయి. ఈ ఘట[illegible]నుకనున్న యదార్థపరిస్థితు లేమిటి?

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మనపై బానిస విద్యావిధానాన్ని రుద్దారు. విద్యార్థి ఉద్యమం పుట్టుకనుండీ యీ బానిసవిద్యా విధాన నిర్మూలనకు, జాతీయ విధానముకొరకు అనేక పోరాటాలు జరిపింది సామ్రాజ్యవాద విద్యా యంత్రములోని అధికారులు విద్యార్థి ఉద్యమం కోరే యీ మార్పులను తిరస్కరించుతూ వచ్చారు నిర్బంధ విధానాన్ని ప్రయోగించి యీ ఉద్యమాన్ని అణచబూనుకొన్నారు. సామ్రాజ్యవాదులు ఎల్లప్పుడూ యీ ఉద్యమాలను అణచుటకు అవసరమైన పోలీసు సహాయాన్ని యిస్తూ తమ బానిసవిద్యా చక్రాన్ని చెక్కుచెదరకుండా చూస్తూ వచ్చారు.

జాతీయ విద్యా విధాన నిర్మాణమునకు కంకణముగట్టుకొన్న జాతీయోద్యమం ఆగస్టు 15 తో రాజకీయాధికారం వహించింది. దీనితో విద్యార్థులలో జాతీయ విద్యావిధానం కావలయు ననెడితృష్ణ ఇనుమడించింది ప్రజాప్రభుత్వాలు నేటి బానిసవిద్యను తుడిచిపెడతాయని కలలు గన్నారు. విద్యార్థుల ఆశలన్నింటిని ప్రభుత్వం అడియాసలు జేసింది. విద్యా పునర్నిర్మాణమునకు తగిన ప్రాధాన్యత యీయలేదు, పైపెచ్చు యీ రెండు, మూడు సంవత్సరములలో ప్రజలలో నూతన విద్యా కాంక్ష విపరీతంగా వ్యాప్తి పొందింది. మన విద్యాభివృద్ధిని అరికట్టాలని నిర్మించిన సామ్రాజ్యవాద విద్యావిధాన చక్రం నూతనంగా విద్యనుగోరి విద్యాలయాలకు వస్తున్నవారికి సీట్లు సహితం చూపించలేకపోయింది పైపెచ్చు ఉన్న విద్యాలయాలలో సహితం కనీస విద్యా సౌకర్యాలను కల్గించలేకపోయింది.

విద్యాభివృద్ధికి కంకణం గట్టుకొన్న విద్యార్థి ఉద్యమం నేటి విద్యాలయాలలోని అధోగతి పరిస్థితులను చక్కబర్చ పూనుకొంది దీనికి సక్రమమార్గం నేటి సామ్రాజ్యవాద విద్యావిధానాన్ని రద్దుజేసి, ప్రజాతంత్ర సూత్రాలలో నూతన విద్యా నిర్మాణమేనని ఆందోళన ప్రారంభించింది విద్యావిధానంలోని సామ్రాజ్యవాదచ్ఛాయలైన డిటెన్‌షన్ విధానం తొలగింపబడాలని, పెట్టుబడిదార్లకు విద్యాలయాలపై పెత్తనం ఉండరాదని, విద్యాలయాలలో పౌరసత్వహక్కులుండాలని, విశ్వవిద్యాలయాన్ని ప్రజాస్వామికసూత్రాలతో నడపాలని పోరాటాలు నడుపుటకు విద్యార్థిపుద్యమం పూనుకొంది.

విద్యార్థి ఉద్యమంయొక్క యీ ప్రధాన నినాదాలు అమలుపర్చబడియన్న నేటి మన విద్యావిధానంపై అభివృద్ధి నిరోధకులకున్న పూర్తి పెత్తనం నాశనం జేయబడటం. ప్రజాస్వామిక విద్యావిధానానికి నాంది. అందుచే నేటి మన విద్యావిధానాన్ని గుప్పటలో అట్టిపెట్టుకొనిన శ్రీ సి. ఆర్. రెడ్డివంటి అభివృద్ధి నిరోధకులు, బందరు, గుంటూరు ఎ సి కాలేజీల ప్రిన్సిపాళ్ళబోటి నిరంకుశవాదులు విద్యార్థి ఉద్యమంపైదండెత్తారు శతాబ్దాలనాడు తయారుజేయబడిన యూనివర్సిటీ కోడును ఆధారంగా తీసుకొని రాజకీయాలలో పాల్గొంటున్నారని, సమ్మెలకు నాయకత్వం వహించుతున్నారని అనేకమంది విద్యార్థి కార్యకర్తలను విద్యాలయాలనుండి బయటికి పంపుతున్నారు. సీట్లకొరతను అనువుగా తీసుకొని నిరంకుశత్వాన్ని. నిర్బంధాన్ని ఎదిర్చే విద్యార్థులకు విద్యాలయాలలో ప్రవేశం దొరకకుండా జేస్తున్నారు డిటెన్‌షన్ విధానమును ఉపయోగించి సంవత్సరం మధ్యలో కొందరిని, పరీక్షల ముందు 'హాల్ టిక్కెట్లు' యివ్వనిరాకరించి మరికొందరి జీవితాలను బలిగొంటున్నారు. పైపెచ్చు ప్రభుత్వసహాయాన్ని తీసికొని పోలీసులను తెచ్చి విద్యాభివృద్ధికి జరిపే యీ విద్యార్థి పోరాటాలను రక్తంలో ముంచెత్త ప్లానులు తయారుజేశారు

జాతీయవిద్యా విధానమును అమలుపర్చ వాగ్దానం జేసిన కాంగ్రెసు మంత్రివర్గం గూడ విద్యార్థి పోరాటాలను బలపర్చుటకు బదులు, నిరంకుశాధికారులను బలపర్చ పూనుకోటం విచారకరం విద్యార్థి పోరాటాలపై పోలీసులను ప్రయోగించమని తాఖీదులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీజేసింది విద్యార్థి ఉద్యమం తన ఉనికికే భంగమని గుర్తించే సామ్రాజ్యవాదులు అనుసరించవలసిన పంథా గాని, యిది విద్యా పునర్నిర్మాణమునకు ప్రభుత్వమునకు పూర్తి సహకార మివ్వ వాగ్దానం జేసినవిద్యార్థి ఉద్యమంపై ప్రజా ప్రభుత్వం యిట్టినిరంకుశ చర్యకు దిగటం గర్హనీయం.

విద్యార్థి ఉద్యమం రాష్ట్రంలోని యితర ప్రజా ఉద్యమాల సహకారంతో బలమైన ఉద్యమాన్ని. ప్రభుత్వంయొక్క యీ పంథాకు వ్యతిరేకంగా నిర్మించాలి ప్రభుత్వం నిరంకుశ విద్యాలయాధికారులను హద్దులలో పెట్టి విద్యార్థుల న్యాయసమ్మతమైన కోర్కెలను అంగీకరించునట్లు కృషి జరపాలి, రాష్ట్రంలో వివిధ విద్యార్థి సంస్థలు తమలోని అనైక్యతను వదలి సంవత్సరములత్యాగఫలితంగా పొందిన కనీస విద్యార్థి పౌరసత్వ హక్కుల రక్షణకు ఏకంగా నిలబడాలి. తలిదండ్రుల సంఘాలను ఏర్పరచి, తలిదండ్రులకు నేటి విద్యాలయాలలోని బూటకపు విద్యావసతులను వివరించి విద్యార్థి పోరాటాలకు వారి సహకారాన్ని.సానుభూతిని పొందాలి

ఇట్టి ఐక్యతను మన ఉద్యమం నిర్మించగలిగినప్పుడే నేటి అధికారుల నిరంకుశ చర్యలను అరికట్ట గల్గుతాం. నేటి బానిస విద్యా విధానమునకు స్వస్తిజెప్పి స్వతంత్ర విద్యా విధానమును పొందగల్గుతాం. విద్యాలయాలలో నిర్భయంగా విద్యార్థి జీవితాన్ని గడప గల్గుతాం. స్వతంత్ర భారతావనికి వన్నె తెచ్చే విద్యార్థి బృంధాన్ని తయారుజేయగల్గుతాం.

ముఖచిత్రం : తమ రక్తం ఓడ్చి నూతన ప్రజాస్వామికరాజ్యాన్ని నిర్మించుకొన్న టిటో యువకులు (యుగోస్లావియా)

అవసరము లేకుండానే చేయవచ్చు వ్యక్తులు యుద్ధాలు సాగించలేరు. యుద్ధాలకు ప్రజలవసరం కాబట్టి, శాంతిరక్షణకు ప్రజలను ఐక్యపరిస్తే, ఇక యుద్ధాలుండవు.

శాంతి స్థాపనలో వలస ప్రజా పోరాటాల పాత్ర

ప్రశ్న : శాంతిస్థాపనకై జరిగే పోరాటాలకీ, వలసప్రజలు సాగిస్తున్న పోరాటాలకీ గల సంబంధాన్నిగురించి మీరేమైనా చెప్పగలరా ?

జవాబు ప్రజాతంత్ర హక్కులకోసం వలసదేశప్రజలు సాగిస్తున్న పోరాటాన్ని మేము శ్రద్ధతో గమనిస్తున్నాం. వారికి మా సంపూర్ణసానుభూతి.

వలసదేశ ప్రజల్ని తిరిగి సామ్రాజ్యవాదుల పాదాల క్రింద పడద్రోసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంతేకాదు ఈ సామ్రాజ్యవాదపెత్తనాన్ని ఇంకా విస్తరింపచేసేందుకు కూడాప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రపంచాధిపత్యంకోసం ఎగబడడమే ఇది ఇదేఈనాడు ప్రపంచశాంతికి ప్రమాదకరంగా ఉంది.

ఈ సందర్భంలో ఒక విషయాన్ని స్పష్టం చేయవలసిఉంది శాంతికిప్రమాదం కలిగిస్తున్నది. తమ స్వాతంత్ర్యంకోసం వలస ప్రజలు సాగిస్తున్న సాయుధ పోరాటం కాదు ఆపోరాటం న్యాయమైనది దానిని సాగించే హక్కు వలస ప్రజలకు సంపూర్ణంగా ఉంది.


కాని, ఈ వలస ప్రజల పోరాటాన్ని అణచి ప్రపంచాధిపత్యాన్ని సంపాదించేందుకు సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాలే శాంతికి ముప్పు తెస్తున్నాయి ఈనాడు తన స్వాతంత్ర్యంకోసం పోరాడవలసిన అవసరం కలిగింది ఒక్క వలస ప్రజలకేకాదు గ్రీసులోకూడా ఇలాంటి పరిస్థితే ఈనా డేర్పడింది. పడమటి యూరప్ దేశాల్లోకూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడవచ్చు సామ్రాజ్యవాదుల ఈదురాక్రమణ దుర్గాహం వల్లనే ప్రపంచశాంతికిప్రమాదం సంభవిస్తుంది.

ఫాసిస్టు వ్యతిరేక మహాసంగ్రామంలో ప్రపంచ ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్రాలకోసం పోరాడారు. ఆయుద్ధానంతరం ఏర్పడినశాంతి పరిస్థితులు సామ్రాజ్యవాదులకేమాత్రం నచ్చడం లేదు.ప్రపంచమంతాతమపెత్తనంకిందికివచ్చేలా ఆ.యుద్ధాన్ని నడిపాలనుకున్నారు సామ్రాజ్యవాదులు. నాజీహిట్లరు కివిన కలలుకూడా ఇలాంటివే కాని, ఈ దురాశలు ఫలించలేదు. అందువల్ల ప్రస్తుత యుద్ధానంతర శాంతి పరిస్థితుల్లో తమ దుర్వాంఛలను నెరవేర్చుకోడానికి వారు ప్రయత్నిస్తున్నారు

ప్రజాతంత్ర, తద్వ్యతిరేకశక్తుల బలా బలాలు

అమెరికన్, బ్రిటిష్ అభివృద్ధినిరోధకశక్తుల బలా బలాలను గురించీ, వారి పన్నాగాలు ఎంతవరకు ఫలిస్తాయనే విషయాన్ని గురించీ టిటో ఇలా అన్నారు·

ఆ రెండిటిని గురించీ నేను అంచనా ఇవ్వలేను కాని, అమెరికా గుత్తవ్యాపారవర్గాలే ఇద్దరిలోనూ బలవంతులన్న విషయం స్పష్టం. దుష్టస్వభావంలో బ్రిటిష్ అభివృద్ధినిరోధక



సత్యపాల్ డాంగ్

వర్గాలు వారికేమాత్రం తీసిపోరు. కాని బ్రిటిష్ వర్గాలు దుర్బలమైనవి. అందువల్లనే అమెరికన్ అభివృద్ధినిరోధకవర్గాలు ఎక్కువ ప్రమాదకరం.

బ్రిటిష్ - అమెరికన్ సామ్రాజ్య వాదులు మరొక ప్రపంచయుద్ధాన్ని రగిలించగలుగుతారని నేననుకోను ఎందువల్లనంటే, యుద్ధాలు సాగించేందుకు ప్రజల సహాయం అవసరం. ప్రజలెవ్వరూ యుద్ధాన్ని కోరడం లేదు అంతమాత్రంచేత కయ్యానికి కాలు దువ్వేపనులు జరగవనికాదు, రెచ్చగొట్టడాలు జరుగుతాయి. వాటి ఫలితంగా సంఘర్షణలు కూడా జరగవచ్చు.

ఈనాడు ఎక్కడ యుద్ధంవచ్చినా, సామ్రాజ్యవాదుల దురాక్రమణకు చెందినంతవరకది సామ్రాజ్యవాద యుద్ధమవుతుంది దానిని ప్రతిఘటించి ప్రజలు సాగించే పోరాటం స్వాతంత్ర్య పోరాటమవుతుంది. కాని, రెండవయుద్ధంలాగా అది ప్రపంచమంతటా జరగదు

ఆ యుద్ధమేవస్తే, దానిని ప్రారంభించే సామ్రాజ్యవాద దేశాల్లో ప్రజలు దానిపట్ల ఉత్సాహం చూపరు. రెండవ ప్రపంచయుద్ధం తమ స్వాతంత్ర్యానికి, తమ ఉనికికీ సంబంధించిన యుద్ధమని ఆదేశాలప్రజలుకూడా గుర్తించారు అందువల్లనే వారు దానిపట్ల ఎంతో ఉత్సాహం చూపారు. కాని, ఈసారియుద్ధం వస్తే, అది తమ దేశాలలోని సామ్రాజ్యవాదుల స్వప్రయోజనాలకు సంబంధించినదే అవుతుంది. ఈ విషయాన్ని గుర్తించి ఆదేశాల ప్రజలు దానితో సహకరించరు.

ఆటంబాంబులెన్ని ఉన్నా, ప్రజల తోడ్పాటు లేనిది ఎవ్వరూ యుద్ధం సాగించలేరు. అందువల్ల. సామ్రాజ్యవాదులు దురాక్రమణ యుద్ధాన్ని ఎక్కడైనా ప్రారంభిస్తే, అది ప్రజల సహకారంలేని యుద్ధమే అవుతుంది. దానికి వ్యతిరేకంగా సాగే స్వాతంత్ర్య పోరాటంలో—అది, ఆయా ప్రజల జీవన్మరణ పోరాటం కాబట్టి ప్రజలందరూ పాల్గొంటారు.

ఈ విషయాన్ని సామ్రాజ్యవాదులుపూర్తిగా గ్రహించారు. అందువల్లనే వారు, నూతన ప్రజాతంత్ర రాజ్యాలపట్ల తమ ప్రజల్లో ద్వేషాన్ని రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో, వాటిపై విపరీతంగా విషప్రచారం సాగిస్తున్నారు. ప్రజాతంత్ర బురఖా తొడుక్కొని, దొంగే. 'దొంగను పట్టుకో', అని అరిచినట్లుగా ప్రవర్తిస్తున్నారు.

కాబట్టి, ఈబురఖాను చించివేసి, సామ్రాజ్యవాదుల నిజస్వభావాన్ని బట్టబయలు చేయడం. నేటి ప్రధాన కర్తవ్యం, ప్రపంచ ప్రజాశ్రేయస్సుకు భంగకరమైన వారిదురుద్దేశాలను తూర్పారబట్టాలి.

యుగోస్లావియా ప్రజాసంఘటన ప్రత్యేకత

ప్రశ్న : యుగోస్లావియా 'ప్రజాసంఘటనను గురించి ఏమైనా చెప్పగలరా ?

జవాబు. 'ప్రజాసంఘటన' నిర్మాణం యుగోస్లావియాకు ఒక క్రొత్త అనుభవం. యుగోస్లావియాప్రజ సంఘటనకుకొన్నిప్రత్యేక లక్షణాలున్నాయి. ఇది మామూలుగా ఏర్పడే వివిధపార్టీల కూటమికాదు. ఇది నిజమైన ప్రజాసంస్థ. యుద్ధానికిపూర్వమే దీని నిర్మాణం

(మిగతా 6 వ పేజీలో)

భారతయువప్రతినిధితో మార్షల్ టిటో సంభాషణ

సత్యపాల్ డాంగ్ వివరణ

నేనూ, దక్షిణాఫ్రికా, మలయా, న్యూజీలాండు, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంకింద ఉన్న విముక్త చైనా దేశాల యువజన సంఘాల ప్రతినిధులూ కలసి యుగోస్లావియాలో 18 రోజులున్నాం.

మా సంచారంలో వేలకొలది యుగోస్లావియా యువజనులను కలుసుకున్నాం. స్త్రీలు, పురుషులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు—అందరినీ కలుసుకున్నాం.

ఆనాడు నాజీ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలోనూ, ఈనాడు దేశపునర్నిర్మాణంలోనూ నాయకత్వం వహించిన మార్షల్ టిటో అంటే వారికిగల ప్రేమ, భక్తి, విశ్వాసాలు చెప్పతరంకాదు "మేము టిటో యువజనులమని వారెంతో గర్వంగా చెప్పుకుంటారు. యుగోస్లావియాలో ఎక్కడికి వెళ్ళినా టిటో పేరు మారుమోగుతూంది

'యువజనరైల్వే' (ఇటీవల యువజన వలంటీరు దళాలు స్వయంగా నిర్మించిన ముఖ్య రైలు మార్గం) పై ఎక్కడచూచినా టిటో పేరూ, చిత్రపటాలూ కనబడతాయి. ఆ రైల్వేను నిర్మించిన వలంటీరు దళాలు నివసించిన ప్రదేశాల్లోనూ, రైలుమార్గానికి ఇటూ అటూ గల చెట్లమీదా, కొండలమీదా, సొరంగాలముందూ ఆయన పేరూ, ఫోటోలు కనబడుతాయి. అంతే కాదు ఎక్కడ యువకులున్నా, అక్కడంతా టిటోపై ఉత్తేజకరమయిన పాటలు ప్రతిధ్వనిస్తుంటాయి.

యుగోస్లోవియా ప్రజా హృదయాన్ని ఇంతగా చూరగొన్న ఆ నాయకుని కలుసుకోవాలని మేము ఉవ్విళ్ళూరాం కాని, అది సాధ్యమవుతుందనే నమ్మకం మాకు లేకపోయింది. హఠాత్తుగా, సెప్టెంబరు 20 వ తేదీన యుగోస్లోవియా యువజనసంఘంవారు, ఆనాటి సాయంత్రం మేము టిటోను కలుసుకోవచ్చునని తెలిపినప్పుడు, మా ఆనందానికి అంతులేకపోయింది

యుగోస్లోవియా యువజనసంఘ అధ్యక్షునితో కలిసి మేము టిటో సందర్శనానికి వెళ్ళాం:

టిటో నివసిస్తున్న ఇంటికీ, ఆ వీధిలోని మిగతా ఇళ్ళకూ ఏమీ భేదంలేదు. యుగోస్లోవియా ప్రభుత్వ నాయకుడు నివసిస్తున్న ఇల్లు అదేఅని కొత్తవారెవ్వరూ అనుకోలేరు.

టిటో గదిదగ్గరకు మేమూ వెళ్ళేసరికి లోపలినుంచి బాలబాలికల దండొకటి బిలబిలా బయటికి పరుగెత్తింది. వారు బాలసంఘ ప్రతినిధులు. తమ మిత్రునితో కొంత గోష్ఠిజరిపి వస్తున్నారట.



మార్షల్ టిటో

టిటో పనిచేసుకునే గది అది మ్యాపులూ, దేశాభివృద్ధినీ, ఇంకా పూర్తికావలసిన కార్యక్రమాన్ని వివరించే చార్టులూ గోడలకున్నాయి. ఒకవైపు టిటో టేబిలు వుంది. సమావేశాలు జరిపేందుకు గదిమధ్య పెద్ద గుండ్రని టేబిలు ఉంది

ఆ గదిలో టిటో మాతో సుమారొక గంటసేపు మాట్లాడారు. ఆయనే సంభాషణ ప్రారంభించాడు. మామా దేశాలను గురించీ, యుగోస్లోవియాలో మమ్మల్ని ఎక్కువగా ఏది ఆకర్షించిందనీ యువజన రైల్వేను చూచారా లేదా అనీ అడిగారు. వాటికి జవాబులు చెప్పి, ఇక మేమడగదలచుకొన్నవి అడిగాము

ప్రస్తుత ప్రపంచ పరిస్థితిలో యువకుల పాత్ర

ఆ ప్రశ్నలలో కొన్నిటిని, వాటికి టిటో యిచ్చిన జవాబులను ఈ దిగువ నిస్తున్నాను ·

ప్రశ్న : ప్రస్తుతప్రపంచపరిస్థితుల్లో సుస్థిర శాంతిస్థాపనకు యువకులు నిర్వహించగల పాత్ర ఏది ?

జవాబు సుస్థిర శాంతి స్థాపనా బాధ్యత నిర్వహించడం చాల కష్టమైన పని. మాత్రంచేత ఆ బాధ్యతను వదలుకో కాదు ప్రపంచంలోని అభ్యుదయ కాముకులైన యువజను లందరిమధ్య పరస్పర సహకారము ఐక్యసంఘటన ఇందుకు అత్యంత అవసరము సామ్రాజ్యవాదుల పాలనక్రింద నానాబాధలను అనుభవించిన దేశాల ప్రతినిధులే మీ రంతా యుద్ధపిపాసుల్ని గురించీ, కొత్తరూపాల్లో తిరిగి తలెత్తుతూ వస్తున్న ఫాసిజాన్ని గురించీ మీరు సదా జాగరూకులై యుండాలి

ప్రపంచ యువజనులమధ్య సహకారం పట్టిమాటల్లో మాత్రమే గాదు వుండవలసింది. మరొక యుద్ధకూపంలో పడిపోకుండా ప్రపంచాన్ని కాపాడేందుకు యువకుల నందరినీ సంఘటిత పర్చగల పోరాటదీక్షతో ప్రపంచ యువజనసంస్థ వ్యవహరించాలి,

ప్రపంచంలోని అభ్యుదయ వర్గాలన్నీ శాంతి కాముకులే కాని వారు దేశక్షేమానికి భంగం కలిగినా సరే యుద్ధం కూడదనే శుష్క-శాంతి వాదులు మాత్రం కాదు సుస్థిర శాంతి స్థాపన మహత్తరమైన ప్రజా పోరాటం ద్వారానే సాధ్యం కాగలదు.

దురాక్రమణశక్తులు తమఇష్టంవచ్చిన ఆటలాడుతూంటే, మనం చేతులుముడుచుకు కూర్చోవడం శాంతికి దోహదం కాదు ఇటీవల అనుభవాలన్నీ ఈవిషయాన్ని రుజువు జేశాయి.

ఒక్క అయుధ బలంతోనే శాంతిని కాపాడగలమని అనుకోవడంకూడా పొరపాటే సాయుధపోరాటం చిట్టచివరిమార్గంగానే పరిగణించాలి అభ్యుదయ వర్గాలన్నీ సర్వశక్తులతో కృషిచేస్తే సాయుధపోరాటం

ఏకాంకిక

లాకౌట్

పినపాల వెంకటేశ్వరరావు

పాత్రలు

భార్య — కమల

భర్త — గోవిందరావు

జీతగాడు — రంగడు

[స్థలం · ఇంటిహాలు — సమయం — గోడ గడియారం చిన్నముల్లు రెండు — పెద్దముల్లు పన్నెండు సూచిస్తూ వుంటవి. గడియారం ప్రక్కగా గోడపై చిలుక — గోడ కానుకొని ఓటేబిలు — దానిమీద గాంధీబొమ్మ — వుంటవి టేబిల్ దగ్గరగా ఒక కుర్చీ — ఒకమూలగా పడకకుర్చీ - గోడకి గోర్కీ లెనిన్ నెహ్రూ. టాగూర్ ఫొటోలు వ్రేలాడుతూ వుంటవి.

కమల పడకకుర్చీలో కూర్చొని రూప రాగాలుతీస్తూ లేసల్లుతా వుంటుంది — 25 సంవత్సరాలు — స్కూలుఫైనలుదాకా చదువుకుంది మబ్బుజాకెట్ — ఎర్రచీరె. తెల్లంచుది ధరించి వుంటుంది — చూపరి — గోవిందరావుకి రెండో సంబంధం.

గోవిందరావు ప్రవేశం 40 ఏళ్ళుంటాయి- కాళ్ళకి చెప్పులు — పంచకట్టు — కోటు — సుద తంచు కండువా!

భర్త రావటంచూసి లేస్తుంది — గోవిందరావు రుసరుసలాడుతూ—కండువాతీసి టేబిల్ దగ్గరున్న కుర్చీమీదవేసి —కోటూడదీసి చిలక్కి తగిలించి — చేతులు వెనక్కి పెట్టుకొని — చేతిలో చేయిగుచ్చి — హాల్లో అటూ ఇటూ చిరాకుగా తిరుగుతూ వుంటాడు — భార్య ఓమూల నుంచొని ఒకచేతిలో లేసు అల్లకం సూది — అల్లిక గుడ్డ ఒకచేతిలో పట్టుకొని వుంటుంది]

కమల : ఏమైందండి ?

భర్తగోవిం (అలాగే తిరుగుతా రుసరుసలాడుతూ) అయింది, ఏమెందుకుకాదు ఇక తెరిపిస్తారుచూస్తాను చదువుకోవలసింది యీ కుంకలకా ఆప్రిన్సిపాలుకా? వాడికే, మారాజులా కాలేజీమూసి కూర్చున్నాడు! మాటమాట్లాడితే సమ్మెయె! చదువురాని గాడిదలందర్నీ డిటెయిన్ చెయ్యక ఏంజేస్తాడు. కోసుకుతింటాడా! వాళ్ళకివీడు నాయకత్వమట! ఎలగబెట్టినట్టె వుంది! నేను ఎన్నోసార్లుచెప్పాను వీడికసలు బుద్ధివుంటేనా? రాజకీయాలు వీడికెందుకూ అంట! వాళ్ళతరపున సమ్మెకు వీడునాయకత్వం!? అఘోరించినట్టేవుంది, ఇంకెవ్వరు లేరేం కాలేజీలో? వీడేనా మగాడు ఉద్ధరించేవాడు!? ఆయన నిర్ణయానికి వ్యతిరేకించి సమ్మెజేస్తే, ఆయన ఆగ్రహానికి గురిగాదాంట! అనుగ్రహం సంపాదించటం కష్టంగాని, ఆగ్రహం ఎన్నాళ్ళు! పోని యీవలుగురికి మల్లె. బుద్ధిమంతుల్లాగా, ఏదో ఉండగూడదు? నాయకత్వం! రాజ్యాలేలను! చదువులు మంటగలిపి

ఇట్లాచదివితే, మేమేంచదివేవాళ్ళం! ఎన్నడైనా ఎరుగుదుమా యీ సమ్మెలు! సమ్మెలు జేస్తేచదువొస్తుందంటె? భక్తి. శ్రద్ధుండాలి గాని. ఏనాడైనా ఒక్కరిమార్కు ఎరుగుదుమా అంట, మేంచదివే కాలంలో!

ఆగ్రహంతో ఏదో చేశాడేఅనుకో, ఏదో కాళ్ళాఏళ్ళాబడి బ్రతిమలాడుకుంటే పోయేదానికి తస్సాదియ్యా. కాలేజీలో జేస్సుకోటానికి సమ్మె — ఊఁఅంటె సమ్మె —, ఆఁ అంటె సమ్మె. తిక్కబాగా అణచాడు. కాలేజి కాస్త మూసి కూర్చున్నాడు — ఏంజేస్తారో చూస్తానని!

నేను ఏమో అనుకున్నాను. వీడు రౌడీకోరు వెధవని ప్రిన్సిపాలు స్పష్టంగా చెప్పాడు నా పరువుకాస్తా తీయటానికి పుట్టాడు — ఏమొఖం పెట్టుకడిగేది నావుద్ధరించే కొడుకుని జేస్సుకోమని' చక్కా తిరిగొచ్చాను!

కమల మంచి పనిజేశారు. అబ్బ ఏమిటండి మరీ అట్లా ఆడిపోసుకుంటారు వాడిమీద. అయనెవరో చెప్పటమేగాని అబ్బాయి ఎల్లాంటివాడో మీకు తెలియదన్నమాట! ఆయనెవరో చెప్పారంట చెప్పటం! ఆయన చెప్పటం యీయనింటం, వాడు రౌడీకావటం! బాగుంది సంబరం!

గోవిం (పడక్కుర్చీలో కూర్చొని) బాగుంది, [illegible]

మంతా సుతిమించి పోతూవుంటె మీటింగుల మీద మీటింగులు, వుపన్యాసాలమీద వుపన్యాసాలు! పైగా తలిదండ్రుల సమావేశాలు! వీళ్ళనీ లాగుతున్నాడు రచ్చకి

కమల. (గోడప్రక్క కుర్చీలో కూర్చొని అల్లుతూ) రచ్చకు వాడు లాగేదేమిటండి! వాళ్ళెందుకు సమ్మె జేస్తున్నారో, వాళ్ళ కష్టాలేందో, తల్లిదండ్రులతోటి చెప్పుకోక ఇంకెవరితో చెప్పుకుంటారు! ప్రిన్సిపాలుతో చెప్పితే ప్రిన్సిపాలు విన్నాడా. యూనివర్సిటీ అధికార్లతోటి చెబితే వాళ్ళు విన్నారా?

గోవింద! చెప్పేవి మంచిమాటలయితే ఎవరయినా వింటారు

కమల మీరంటున్నారు కాదని, లేకపోతే ఆ ప్రిన్సిపాలనాలి, ఆ యూనివర్సిటీ అధికారులనాలి మంచిమాటలుకాదని, ఇంకెవరంటారు?

గోవింద ఇంకెవరంటారా, మనబోటి తలిదండ్రులెంతమంది గుసుస్తున్నారో?

కమల. 'మనబోటి' అని నన్నుగూడ కలిపి శ్రమతీసుకోబోకండి!

గోవింద ఓహో — యింకే — ఊఁ — కానియ్యండి — నువ్వూ వాడి పక్షమే అన్నమాట?

కమల (అల్లికం ఆపి భర్తవంకచూస్తూ) ఒక్క నేనేంటి, పెద్ద పెద్ద కాంగ్రెసు నాయకుల దగ్గర్నుంచి సామాన్యమైన పెద్దలనుకోబడే వాళ్ళంతా ఇక కాలేజీ పిల్లలు సరేసరి. వాడుజేసేది మంచిపని కాకపోతే. ఆ పెద్దలంతా ఆప్రిన్సిపాలు దగ్గరకు అన్నిసార్లు రాయబారం ఎందుకు పోతారు అన్నిసార్లు విద్యాశాఖాధికారి దగ్గరకెందుకెళ్తారూ, వాళ్ళందరికీ మీరు చెప్పినట్లు బుద్ధిలేకనే అనుకుంటా, పాపం!

గోవింద నేననేది అదికాదే! ఇప్పుడు వాళ్ళంతా వెళ్తున్నారే అనుకో, ఐతేమాత్రం అసలు తప్పు మనోడిదంటావా, కాదంటావా?

కమల. మనోడిదే అని ఎట్లా నిర్ణయిస్తా?

గోవింద ఎట్లా నిర్ణయించేదేముంది, స్పష్టంగా తెలుస్తుంటె - ఎవర్నో డిటెయిన్ చేస్తే వీడికెందుకు; ఎంతమంది లేరు. వీడే వాళ్ళకు నాయకత్వం వహించటమేంది?

కమల ఐతే అది తప్పంటారా?

గోవింద · తప్పేంది తప్పున్నరఅంటాను.

కమల; మాబాగా జెప్పారు తప్పున్నర అయితేమరి ఆ కాదన్నమహానుభావుడు వాళ్ళని తిరిగికాలేజీలో ఎందుకుజేస్సుకున్నాడో పాపం?

గోవింద జేస్సుకుంటె?

కమల : చెప్పుకున్నారుగదా తప్పులేదంటాను. పైగా వాడు న్యాయంకోసమే నిలబడ్డాడూ అంటాను.

గోవింద : వీడు నిలబడ్డ మేందాంట నే ననేది ?

కమల : ఎవరు నిలబడాలంటారు ?

గోవింద : అంతమందిలో ఎవరో లేక పోయారు ?

కమల : ఎవరో ఉంటె ?

గోవింద : మనవాడిమీద గుర్తు లేకుండా పోయేదిగదాంట !

కమల : అప్పుడు మనవాడిమీద గాదను కోండి, ఇంకోడిమీదయినా వుండేదంటారా ? ఎవరయినా అంతే !

గోవింద : అంతే అను కో. మనోడి పేరు బైటికి రాకుండేదిగదా అవి !

కమల : ఓసీ అంతేనా ?

గోవింద : (సిగరెట్టు కాల్చి) అంతే కాద మకో - అసలు వాళ్ళదగ్గరా చాలాలోట్లున్నాయి వెన్నపడింది అంటే కుండపగిలిందంటే ఎల్లా కుదురుతుంది? మంచో, చెడో ప్రాధేయ పడాలి. వేడుకోవాలి, కాళ్ళావేళ్ళాపడి తేలికలో పోయేట్టు చూసుకోవాలి గాని. సమ్మె జేయట మంటె వాడికంట్లో గుచ్చుకావటమేగా ! అదీగాక మనవాడి పేరంటేనే వుగ్రుడై పోతున్నాడు.

కమల : మన పిల్లలవల్ల తప్పులేకుండా వుంటె వాడు వుగ్రుడైతే మాత్రం ఏంజేస్తాడు?

గోవింద : వీళ్లుండాలి గదా ?

కమల : అవిషయం వేరే మనం చెప్ప నక్కర్లా-అవుననుకోండీ,సమయానికి, అన్నట్లు జ్ఞాపకం వచ్చింది: మీ ఆఫీసులో అప్పుడెవర్నో తొలగిస్తే. మీరంతా ఎందుకండీ ఆఫీసువది లేసి బయటికొచ్చారూ ?

గోవింద : ఔననుకో, ఐనా అది జీవనానికి సంబంధించిన విషయమాయే. ఒకడి జీవితం నాశనమౌతుందే. అని ఆరోజువచ్చాం అనుకో!-

కమల : అనుకోవటమేముంది, వచ్చారు. మంచిపని జేశారు. ఒకడి చదువు నాశనం కావటమన్నా వాడిజీవితం నాశనం కావటమే కదా ? జీవితమే లేకపోతే జీవనమెక్కడ ? అందుకే అలాంటి కొన్నివందలమంది పిల్లల జీవితాలు పాడుగాకుండా కాపాడాడు మనోడు. తప్పేముంది ? ఇదాక తప్పన్నార అన్నారు!

(రంగడు ప్రవేశం - కుడిచేతిలో వాసిన కట్టిన నేతితెపాళ. ఎడం బుజంమీద మడత పెండువాని చేత్తో అదిమిపట్టుకొని - ఎడంపాపటి, ఎగ్గట్టిన పంచె - పదహారేళ్ల వుంటాయి.)

రంగడు : ఏదో చినబాబుగోరు చంగతే వట్టుగుంటే మీరు మాట్టాడుకొనేది ? చమ్మె సడుపుతుండా డంటె చమ్మె ? అదేందో తెల్చుకు పోదామనే. చక్కావచ్చా నేత్తెప్పాళా తీసుకొని పెదబాబుగోరితో పెప్పి.

కమల : (అల్లకం అసి రంగడు వైపు చూచి) ఏరా రంగడు ఎప్పుడు రావటం ! ఇప్పుడేనా. బియ్యమూ, నెయ్యి పంపమని కబురుజేశాం నీచేత పంపారా—పా— దొడ్లోకి పోయి కాళ్ళు గడుక్కురా—పో—

రంగడు : (తెపాళ క్రిందబెట్టి, నెత్తి గోక్కుంటు) ఏందమ్మగోరు కబురైతే పేశారంట—పెద్దబాబుగోరు అన్ని సిద్ధంజేసిరు— అంతలో ఉత్తరంయొక్క వచ్చింది— పెద్ద బాబుగోరుచించిచదివిన్రు- చినబాబుగోరే ఏసింద్రంట—అందులో ఆయనెవరో అధికారి గామోను. కాలేజిమూసింద్రని-బియ్యంమాత్రం పంపొద్దని—అంతగైతే పరిమిటుమీద తెచ్చుకో వచ్చని రాసిందట— అయినగోరెంత సెపితే అంతేనాయి పెదబాబుగోరు— అందుకని "బియ్యం మొద్దులేరా రంగడు—నెయ్యి తీసుకు పో"— ఏన్నాళ్ళనుండో చినబాబుగోర్ని చూడా లంటున్నావుగా అనిసన్నే వంపిన్రు— అదమ్మా చంగతి— ఇంతకీ చినబాబుగోరేంమ్మా ?

కమల : ఆయన నీకెక్కడ కనబడు తాడురా — కాలేజీ సమ్మెలు—ఉపన్యాసాలని ఎక్కడ తిరుగుతూ వుంటాడో—పొద్దునగా రెండు మెతుకులు ఏమని తినిపోతాడో—మళ్ళీ ఎప్పుడో రాత్రికి వస్తాడు.

రంగడు : చమ్మె ఎట్టావుందమ్మా ? బాగ చాగుతూవుందా ? మంచిపని జేశాడుమ్మ చిన బాబుగోరు. వాడితిక్క అట్టగాని అనగదమ్మా!

కమల : (నవ్వి భర్తవంక చూస్తూ) ఏంత్రోయి అంత కచ్చవెళ్ళగక్కు తున్నావు ? అయిన్ని నీకేమి ఎరుగుదువురా ? అసాధ్యుడల్లే వున్నావే !?

రంగడు : ఎరగాలేందమ్మగోరు ! అసలీడి నెత్తిన టోపీ తగిలించిందో లేదో ముందు చెప్పమ్మగోరు-తరువాత చెప్పుతాను వీడిసవి!-

కమల : (నవ్వి తిరిగి భర్తవంక జూచి) తగిలించట మేందిరా—మొన్న స్వతంత్ర దినోత్సవమని జరిగింది చూశావూ, దానికి మూడు వేలుగూడ ఖర్చు పెట్టాడు.

రంగడు : అసలువాడు తెల్లోడంటగందా — ఆటోపీపెట్టట మేంది?

కమల : సిగ్గుంటేగదూ ?

రంగడు : తొడేళ్ళకు సిగ్గేందమ్మగారూ?- ఈటోపీలు తగిలించిన తోడేళ్ళని నత్తే నమ్మ గూడదు. వీళ్ళని నాకళ్ళారా చూత్తుండాగదా— ప్రతిరోజూ తగే ఈడితోటి. ఎవర్ని మోసం చేయజూస్తారు? తెల్లటోపీకింద నల్లటోపీ ఉందని మాకు తెలియకపోతేగందా వీడిఆటలు సాగేవి. మా పొలాలు కాత్తా గదుంకోవాలని వత్తారు. మా పొలాలు మాకు తెల్లవదూ. మాతాతలు ముత్తాతల దగ్గరనుంచి చేసే పొలాలు—పోలీ చుల్ని తెచ్చి, మమ్మల్ని పొలంలోనుంచి ఎల్ల గొట్టి కాజేయాలని జూస్తే యీళ్ళని కర్రలు తీసుకు వెనికిడితే వడితే ఉరుకో—ఉరుకో. ఈ తోడేళ్ళని చత్తే నమ్మగూడదు. నా అనటం మీద సెపుతుండాగందా—యీటోపీ పెట్టినోళ్ళ అంతేదో కనుక్కోవాల్చిందే!— అమ్మగోరూ అటుకెల్లే పోతే కనపడటాదేమో చినబాబు గోరు—పొయ్యొత్తానమ్మగోరు.

కమల : (నవ్వుతూ) ఆరినీదుంపతెగ. మీ అయ్యగారికంటే నీవేనయంరా—అడగ మర్చి పోయాను అప్పాయి బియ్యం పంపవద్దని ఉత్తరం వ్రాశాడా— (భర్తతో) ఏమందోయ్, అవును—ఆరోజు నాతోగూడ వాదించాడు. ఎలాగో దొరికినంతవరకే తినాలిగాని, మనమే బ్లాకులో తెస్తే వాళ్ళుచరీ కళ్ళాలు తీసిన గుర్రా లల్లే గంతులేయరా అని! వాడికెందుకండి అన్నిట్లో అంతపట్టుదల?

రంగడు : అమ్మగోరు నేనొత్తానండి. చిన బాబుగోర్ని సూడాలని మాపాణంగా వుంది. ఎన్నాళ్ళనుండో పీకుతావుంది మనసు, బాబూ! దో వెటో కొంచెం చెప్పండి. చెంగనాలమీద పోయి కలుసుకుంటాను చినబాబుగోర్ని.

కమల : ఓరి! నీ దుంప తెగ, పోదువు గాన్లే. భోంచేద్దువుగా నుండు.

రంగడు ; ఇప్పుడొద్దమ్మగోరు. వచ్చే ప్పుడే డొక్కనిండా పట్టిచ్చా, బావ్‌మనేదాకా! వత్తానమ్మగోరు. చినబాబుగోర్ని సూడాలని జిమ్మున పీకుతుండాది పాణం.

కమల : ఆరె నీదుంప తెగా, సరె. అలాగె పోయిరా.

గోవింద : 'వుండ్రా' నేనుగూడ అటే వస్తాను ఎదీ ఆ కోటందుకోవే.

కమల: (లోలోపల నవ్వుతూ) ఎక్కడికో ఆ పోక ! ?

గోవింద : అంతప్పేముంది? నేను వాళ్ళ వెనుకే ఉండబోవాలిగా ?

కమల : (నవ్వుతూ) ఐతే ఎర్దరుగావి వుండండి. కాఫీ పుచ్చుకోరూ?

టిటో

(3 వ పేజీ తరువాయి)

ప్రారంభమయింది యుద్ధకాలంలో బాగా అభివృద్ధి పొందింది ఈనాడు యుగోస్లావియాలో ప్రజాస్వామ్యానికి పునాది ఇదే.

ఈ సంస్థ అభివృద్ధిపొందిన ప్రత్యేక పరిస్థితుల ననుసరించీ, సమాజంలో కలుగుతూన్న పరివర్తన ననుసరించీ ఈ సంఘ ప్రత్యేకలక్షణా లేర్పడ్డాయి

యుద్ధానికి పూర్వ మిది 'ఫాసిస్టు వ్యతిరేక ప్రజాసంఘటన' గా ఉండేది. ఫాసిస్టు శక్తులనూ దేశాన్ని ఫాసిస్టుదేశంగా మార్చివేసేందుకు జరిగిన కుట్రలనూ, ఫాసిస్టు దురాక్రమణనూ ప్రతిఘటిస్తూ వచ్చింది. ఈ ప్రజా సంఘటన వివిధ పార్టీ నాయకులమధ్య సంప్రతింపులద్వారా పైనుంచి నిర్మాణమయింది కాదు అభివృద్ధి నిరోధక నాయకవర్గాలతో సమాధానం కుదరడం అసాధ్యమైపోయింది అందువల్ల ఆ ప్రజాసంఘటన, ప్రజాసామాన్యంలోనుంచే, పునాదులనుంచే నిర్మించడం జరిగింది

యుగోస్లావియాపై నాజీదురాక్రమణ ప్రారంభం కావడంతోనే ప్రజాతంత్ర బురఖా వేసుకొన్న పార్టీల బండారమంతా బయట పడింది ఆ పార్టీలు విచ్ఛిన్నమయి పోవడమో, శత్రువులకు లొంగిపోవడమో లేక, దేశద్రోహపు కొడిగట్టి దురాక్రమణ దారులతో పూర్తిగా చేతులు కలపడమో జరిగింది.

ఆ పరిస్థితుల్లో యుగోస్లావియా ప్రజలకు తగిన నాయకత్వం లేకుండాపోయింది.

ఒక్క కమ్యూనిస్టు పార్టీయే తనబలాన్ని కాపాడుకో గలిగింది స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించి, ప్రజలను ఎలా నడపాలో తెలిసింది ఆ ఒక్క పార్టీకే

నాజీ వ్యతిరేక పోరాటంలో ఈ ప్రజా సంఘటన నిర్మాణం బాగా దృఢపడింది దాని బలం ఎంతో పెరిగింది యుగోస్లావియా జనాభాలో పెద్దభాగం దాని నాయకత్వంక్రింద సంఘటిత మయింది. దీని ఫలితంగా పాత రాజకీయ పార్టీలు యుద్ధానంతరం మళ్ళాతలెత్త లేక పోయాయి. పవిత్ర స్వాతంత్ర్య పోరాటాన్ని ఏకముఖంగా సాగించిన యుగోస్లావియా ప్రజానీకం తమను తిరిగిఛిన్నాభిన్నంచేయ గల అవకాశాన్ని ఆ పార్టీలకు ఇవ్వదలచుకోలేదు

'ప్రజాసంఘటన' అన్న పేరు పట్టి అలం... యుగోస్లా

వియా ప్రజలు తమ ఉనికికోసం సాగించిన పోరాటానికి నాయకత్వం వహించిన సంస్థ ఈ పేరును సార్థకం చేసింది

స్వాతంత్ర్య పోరాటంలో 'ప్రజాసంఘటన' కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంకింద పనిచేసింది. అంతమాత్రంచేత ఈసంస్థలోని ముఖ్య స్థానాలన్నీ కమ్యూనిస్టులవే అని అనుకోకూడదు 'ప్రజా సంఘటన' లోని ఇతర పార్టీలవారు కూడా ప్రముఖ స్థానాల్లో ఉన్నారు. 'ప్రజా సంఘటన' సభ్యత్వం 70 లక్షలు దీనిలో 20 లక్షలు యువజనులే.

ఇది వివిన్న కార్యక్రమాలుగల సంస్థల కూటమికాదు, అన్నిపార్టీలుకలిసి చర్చించి నిర్ణయించుకున్న ఏకైక కార్యక్రమాన్ను సరించే ఐక్యసంఘటన ఇది. నాజీ వ్యతిరేక స్వాతంత్ర్యపోరాటంలో ఏర్పడినప్రజాతంత్ర పునాదులపై యుగోస్లావియాను పునర్నిర్మించడమే దీని ఏకైక లక్ష్యం

ఈ ఆశయసిద్ధికి మా ప్రజలు తమ సర్వశక్తులను వినియోగించి కృషిచేస్తున్నారన్నది మీరు స్వయంగా చూడగలిగారు మీ మీ దేశాలకు తిరిగి వెళ్ళినప్పుడు, గత యుద్ధంలో అన్నిటికన్నా ఎక్కువ నష్టపడిన దేశాల్లో యుగోస్లావియా ఒకటనీ, తన జాతీయ జీవనాన్ని పునర్నిర్మించుకోడానికే ఇప్పుడది సర్వశక్తులను వినియోగిస్తున్నదనీ మీ ప్రజలతో చెప్పండి నిర్మాణ కార్యక్రమం మినహా మరొక దానిని గురించి యుగోస్లావియా ఆలోచించడంలేదనీ, మరొక యుద్ధాన్ని రెచ్చగొట్టేందుకు సామ్రాజ్యవాదులు సాగిస్తున్న ప్రతిచర్యనూ తీవ్రంగా అసహ్యించుకుంటూందనీ చెప్పండి, సుస్థిరశాంతికోసం సాగుతూన్న పోరాటంలో యుగోస్లావియా ఎల్లప్పుడూ అగ్రశ్రేణిలోనే ఉంటుందని మీ ప్రజలకు స్పష్టంగా తెలపండి

సంపాదకవర్గం

యస్. వి. నరసయ్య (గౌరవ సంపాదకుడు)
ఎ కె ఆర్. బి కోటేశ్వరరావు (సంపాదకుడు)
వి. వి దాసు
యం. రామకృష్ణరావు
యన్. వి. నారాయణ (మేనేజరు)

సంపాదకీయం

శ్రీ దాసరి నాగభూషణరావుపై 'డిబార్' ఆజ్ఞనుఉపసంహరించుకోవాలి

నవంబరు 14 వ తేదీన సమావేశమైన ఆంధ్ర విశ్వవిద్యాలయ సిండికేటు సమావేశం శ్రీ దాసరి నాగభూషణరావు (గుంటూరుపట్టణ ఐక్యకార్యచరణ సమితి కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ సహాయకార్యదర్శి) ను కాల పరిమితి లేకుండా విశ్వవిద్యాలయం నుండి డిబార్ చేసినట్లుతీర్మానించింది విద్యార్థిఉద్యమ చరిత్రలో యీ నిరంకుశ చర్యకు సాటిలేదు ఈ నిర్బంధాజ్ఞ వెనుకనున్న కుట్రఏమిటి?

ఆంధ్రదేశమంతటా నూతన విద్యావిధానం కొరకు విద్యార్థిపోరాటాలు జరుగుతున్నాయి ఈ పోరాటాలలో గుంటూరు ఏ సి కాలేజీ విద్యార్థులపోరాటం గణనీయమైంది. డాక్టరు సైప్పు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడే యీ పోరాటం ఆంధ్రవిద్యార్థులకు ఆదర్శప్రాయమైంది ప్రతి ఆంధ్రవిద్యార్థి తానుగూడ తన హక్కులకొరకు ఎ సి కాలేజీ విద్యార్థులవలె పోరాడాలని తయారవుతున్నాడు. ఈ పోరాటాలకు శ్రీ నాగభూషణరావు నాయకత్వం వహించి నడిపాడు

నేటి విద్యార్థిపోరాటాలు జయప్రదమవడమన్న విద్యావిధానంపై తమపెత్తనం ఊడుట అని సి ఆర్. రెడ్డిగారి నిరంకుశ అధికారులకు స్పష్టముగా తెలుసు అందుచేత, విద్యార్థి ఉద్యమాన్ని నాశనంచేయుటకు రాష్ట్రానికంతకూ ఆదర్శపోరాటాలు నడుపుతున్న గుంటూరు ఉద్యమంపైన యీ అధికారులు తమశక్తినంతా కేంద్రీకరించారు. ఈప్లానులో భాగంగానే గుంటూరు ఉద్యమానికి ముఖ్యనాయకుడైన శ్రీనాగభూషణరావును డిబార్ జేయుటజరిగింది.

విశ్వవిద్యాలయాధికారులు తమ యీకుట్ర నంతటిని కప్పిపుచ్చుకొనుటకు కొన్ని కాకమ్మ కథలు అల్లారు శ్రీ నాగభూషణరావు వాల్తేరులో బందరు ప్రిన్సిపాలును కొట్టాడని ప్రచారం ప్రారంభించారు. ఈ అబద్ధ ప్రచారంలో తమ నిరంకుశ చర్యను సమర్థించుకొన జూస్తున్నారు కాని ఈనిరంకుశులు తమ సిండికేటు తీర్మానంలో నహితంగా శ్రీ నాగభూషణరావును డిబార్ జేస్తూ బందరు ప్రిన్సిపాలును కొట్టినందుకు యీ చర్య తీసుకొం

(మిగతా 14 వ పేజీలో)

చాలించరా - ఈపశుకృత్యాలు!

★ "నవకుమార్"

అలనాటి ఆదర్శమూర్తీ! ఓ భారతీయుడా!
సాటిదేశాలందు - తల ఎత్తగలవా?
నీ వీరగాధలను - వినిపించగలవా??
చాలించరాయిక - ఈ పశుకృత్యాలు!
మత్తులోబడిపోయి మైమరచినావోయి!
సోదరి మానమును, మంటగల్పితివోయి!
పసిపిల్లల, పిల్లలతల్లుల, వృద్ధుల, యువకుల,
నిర్దయుడవై నీవు వరుస నరికితివోయి!! ॥అ॥

నీ శక్తివంచించి - నాశమొనరించి.
కించపర్చినిన్ - అసమర్థుడవంచు
సాటిదేశాలందు - చెప్పుచున్నాడోయి!
శత్రువూ!
తిరిగి నీ నెత్తిపై కెక్కనున్నాడోయి!! ॥అ॥

మనిషిని మనిషి నరకుకొమ్మ
హిందూ ముస్లిం ఏమతములోలేదు
ఇక్‌బాల్, రవీంద్రుడు చెప్పినదిదియే,
మానవులంతా ఒకటేనోయీ!! ॥అ॥

కుట్రలు తెలిసి - మైకమునీడి
భేదముమాపి - సోదర ప్రేమతో
ఐక్యంబయీ - అందుకొంటివా?
నీదేశ సౌభాగ్యమోయీ!
నీ ప్రజల కళ్యాణమోయీ!
కలలోని స్వర్గాన్ని స్థాపించగలవోయి!
నీదేశ గౌరవము నిలుపుకొనగలవోయి! ॥అ॥

★

తెలిసికోండి

"గంగినేని"

కాటికి కాళ్ళు చాచిన
బూజిన విద్యా విధానం
పాలించే నియంతలారా!
ఎవరో మే మెవరెవరో
నేటికైన తెలుసుకోండి!
డిటెన్షన్లు డీబార్లు డిస్మిస్సులు
తప్పంటే కాలేజీ క్లోజింగులూ
నిత్యకార్యక్రమం చేసుకున్న
బి సి, నాటి పరదాస్య మనస్తత్వ
విద్యాలయాధికార్లార! నేటికైన
ఎవరో మే మెవరో తెలుసుకోండి!
అగు! అగు! సి ఆర్. రెడ్డిగారు!
అవు! అవు! నీనిరంకుశ కత్తి!
నీకు తెలుసు మాకు తెలుసు
కర్కశ రక్కసి పాలన కిది
కట్ట కడపటి తుట్ట తుది
మరణ వికటాట్టహాసం అని!
డాక్టరుసైప్పు! ఇంటికిపద!
కల్లతెల్లదొరా! 'విద్యార్థి వేట'
మాస్వతంత్ర భారతదేశంలో
సాగనీము సాగబోదు వెళ్ళిపో!
కాజ శివరామ కృష్ణారావు!
చూడు! చరిత్రకారుని లేఖిని!
నిరంకుశుల నియంతల
గోరీకట్టను చేరినప్రజ!
ప్రళయరుద్రులై పరుగిడు
ఐక్యవిద్యార్థి సైనికప్రవంతి!
సామ్రాట్టుల బానిసగుహలు
పడగొట్టుక ప్రభవించిన
దోపిడీల గుండెలలో పిస్టల్
గుండై ప్రేలిన యువ సింగాలం!
దేశానికి గుండెకాయ
లోకానికి వెన్నెముక
భవిష్యత్ నిర్మాతలు
నిర్ణేతలు మేమేనండి!
స్వతంత్రభారత చరిత్ర
రక్తాక్షరాలతో వ్రాసిన
త్యాగాలకు త్యాగం నేర్పిన
మేం విప్లవ గంధం పూసిన
విజయనినాద విద్యార్థులం!
మాపతాక యువపతాక
స్వాతంత్ర్యం శాంతిఅభ్యుదయ
భవ్యాశయ భావిజయపతాక!
ఎదురులేని తిరుగులేనిజండ!

(3 వ కాలం తరువాయి)

తొలగించిన డాక్టరు సైప్పు చర్యలు ఖండించుతూ, సైప్పుకు తోడుగావున్న సి. ఆర్. రెడ్డికి తగుబుద్ధి చెప్పుతారని ఆశిస్తూ, ఇన్ని రోజులనుండి నిరంకుశ విద్యావిధానముక్రింద వున్న విద్యార్థులకు విరివిగా విరాళాలు యిచ్చి తోడ్పడుతారని ఆశిస్తూ అధికారుల తప్పుడు ప్రచారానికి పట్టణ ప్రజలంతా మోసపోవద్దని త్వరగా కాలేజీలో దాసరిని చేర్చుకోమని ఆందోళన చేస్తారని ఆశిస్తాం.

ప్రతాప రామకృష్ణయ్య
పట్టణ ప్రజాకమిటీ, గుంటూరు.

డాక్టరు సైప్పు చేయు దురంతాలు

గుంటూరు ఏ. సి. కాలేజీ ప్రిన్సిపాల్ యగు డాక్టరు సైప్పు కాలేజి విద్యార్థియగు 'దాసరి'ని అనవసరముగా బయటికి వెళ్ళగొట్టి కాలేజిని లాకౌటు చేసినాడు డాక్టరు సైప్పు చర్యను నిరసించుతూ విద్యార్థులంతా ఏకగ్రీవముగా కాలేజీని తెరవమని. 'దాసరి'ని చేర్చుకొనమని డాక్టరు సైప్పువద్దకు రాయబారము వెళ్ళినారు. దానికి సైప్పు నిరాకరించాడు దీనికితోడు సైప్పుకు సి. ఆర్. రెడ్డి మద్దతు నిచ్చాడు ఈ డాక్టరు సైప్పు, సి ఆర్. రెడ్డిలాంటి అభివృద్ధినిరోధకులు, విద్యార్థి వుద్యమము యొక్క ఐక్యతను విచ్ఛిన్నపరచి విద్యార్థులలో చీలికలుతెచ్చి వారి కటిల నీతిని కొనసాగించుటకు ప్రయత్నించుచుండిరి

సైప్పుకు నాయకత్వం వహించిన సి ఆర్ రెడ్డిగారు ఏనాడైనా దేశసేవ చేసిన పాపాన పోలేదు వీరి పాత్ర ఎల్లప్పుడూ విద్యార్థులలో చీలికలు కలుగచేసి విద్యార్థులలో అనైక్యతను సృష్టించి విద్యార్థులకు ద్రోహంచేయటం.

వీరియొక్క కుట్రలను విద్యార్థులు ఎన్నడూ సహించరు. విద్యార్థులపై జరిగిన అన్యాయాన్ని ఎదుర్కొని. విద్యార్థుల తరఫున నిలబడి, వారి హక్కులకొరకు పాటుబడటకు మారుగా, డాక్టరు సైప్పుకు బంటుగా నిలబడటమే తన పంథాగా పెట్టుకొని సి ఆర్ రెడ్డిగారు కాలేజీని మూయించటము అక్రమం విద్యార్థులంతా కాలేజీని తెరవాలని, 'దాసరి'ని ఎట్టి షరతులు లేకుండా చేర్చకోవాలని ప్రచారం చేయటం పట్టణ ప్రజలకు తెలుసు. ఈ ప్రచారంతో యీ అధికారుల బ్రతుకు బయటపడుతుందని పోలీసుమద్దతుతో అరెస్టులను చేయించవలెనని కుట్రలు పన్నుతున్నారు.

ప్రజలకు మా విజ్ఞప్తి ఏమిటంటే: డాక్టరు సైప్పుకు దాసరికి వచ్చిన తగాదా విషయమై యింతకుముందు కరపత్రాలద్వారా తెలియపరిచాము. మధ్యవర్తులద్వారాకూడా సైప్పుకు తెలియచెప్పినారు. ఈ సమస్యను ప్రజలందరకు వెల్లడించుటవల్ల వారికి అవమానమై చేయునదిలేక పోలీసు మద్దతుతో విద్యార్థులను అరెస్టు చేయించవలెనని కుట్రలు పన్నుచుండిరి కాన పట్టణ ప్రజలంతా అసలు సమస్యను తెల్సుకొని విద్యార్థులకు అండగా నిలబడి నిరంకుశంగా దాసరిని కాలేజీనుండి

(మిగతా 2 వ కాలంలో)

విద్యార్థి ఉద్యమ ఐక్యతే జాతీయ

23 వ ఆంధ్రరాష్ట్ర విద్యా

భారతదేశ స్వాతంత్ర్య సాధనతోబాటు, దేశంలోని అభివృద్ధి నిరోధకులు కల్పించిన మతకలహాల మారణహోమంలో స్వాతంత్ర్యానికి భంగంకల్గే ప్రమాదం ఏర్పడింది. అభ్యుదయ పాత్రనిర్వహించుచున్న నెహ్రూ ప్రభుత్వాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి భారత పౌరుని ఎదుర్కొంది ఆంధ్ర విద్యార్థులు ఈ కార్యాచరణకు నడుంబిగించారు సమిష్టి చర్చలు, నిర్ణయాలద్వారా యీమహత్తర కార్యభారానికి రాచబాట నిర్మించేందుకు ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ మహాసభప్రతినిధులు నవంబరు 1, 2, 3 తేదీలలో భీమవరంలో సమావేశమయ్యారు.

మహాసభ ఏర్పాట్లు

ఆహ్వాన సంఘమువారు మహాసభ ముందున్న కర్తవ్యాన్ని ప్రచారంచేస్తూ, అందుకు పశ్చిమ గోదావరి ప్రజల ఆర్థిక నైతిక సహాయాన్ని అర్థించారు భీమవరంలోను, పశ్చిమ గోదావరి జిల్లాలోను, వాడవాడలలో మహాసభను గూర్చి ప్రచారం చేశారు. భీమవరంలోని, విద్యార్థులు, మేధావంతులు మహాసభ జయప్రదం కావాలని దీవించుతూ, ఐక్య విద్యార్థి వుద్యమ నిర్మాణం జరగాలనీ, కోరుతూ తమ శక్తికొలది విరాళాలుయిచ్చారు. రాష్ట్ర మహాసభకు పోటీగా జిల్లా విద్యార్థి కాంగ్రెసువారు పోటీమహాసభ రెండు రోజులు ముందుగా ఏర్పాటు చేశారు ప్రజలను విద్యార్థి ఫెడరేషనువారు మోసము చేస్తున్నారని కరపత్రముల వర్షం కురిపించారు కాని వీరికి భీమవరం ప్రజలు రు 300 లు విరాళంగా యిచ్చి తగిన సమాధానం చెప్పారు. పట్టణ కాంగ్రెసు పౌరులు విద్యార్థి కాంగ్రెసు సోదరులు విరివిగా విరాళాలు యిచ్చి విద్యార్థి ఫెడరేషన్ ఐక్యతాకృషికి బలం చేకూర్చారు మొత్తం పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు రు 1607 లు యిచ్చి మహాసభకు స్వాగతం యిచ్చారు. చుట్టుపట్ల గ్రామ రైతులు రు 30-8-0 లు విలువకలిగిన కూరగాయలు పంపి,తమ బిడ్డల మహాసభను ఆశీర్వదించారు భీమవరంలోని పత్రములు, ఎలిమెంటరీస్కూలు. వెల్‌కం సినిమా హాలులను ప్రతినిధుల బసలసమావేశాలకు వుచితంగా యిచ్చారు.

ప్రతినిధుల సమావేశం

నవంబరు 1 వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు వెల్‌కం హాలులో ప్రతినిధుల సమావేశం ప్రారంభమయినది. వివిధజిల్లాలనుంచి 400 మంది డెలిగేట్లు, విజిటర్లు వచ్చారు. తెలంగాణానుంచి 17 మంది సౌహార్ద ప్రతినిధులు కాలినడకమీద 30 మైళ్ళు నడచి మహాసభకు హాజరయి విశాలాంధ్ర నిర్మాణానికి పునాదులు బలవత్తరంచేశారు తెలుగుసోదరులతో కలసి పోవాలనే తెలంగాణా ప్రజలకృత నిశ్చయాన్ని ప్రదర్శించారు. మహాసభప్రారంభకులయిన ప్రొఫెసరు ప్రతాపగిరిగారికి, యువ జననాయకులు శ్రీ యస్ వి నర్సయ్యగారికి ప్రతినిధులు గార్డ్ ఆఫ్ ఆనర్ యిచ్చి పుష్పమాలాలంకృతులను చేశారు మహాసభ నిర్వహణకు 9 మంది విద్యార్థినాయకులతోకూడిన అధ్యక్షవర్గం ఎన్నుకోబడింది ఈ అధ్యక్ష వర్గంతరపున ఆంధ్రవిద్యార్థి నాయకుడు శ్రీ జి జగన్నాధరెడ్డిగారు కరతాళ ధ్వనులమధ్య అధ్యక్షపీఠం అలంకరించారు

ఆహ్వానసంఘ అధ్యక్షులు మారెళ్ళ నరసింహారావుగారు ప్రతినిధులను ఆహ్వానిస్తు భారతదేశం మతకలహాల కారుచిచ్చులలో అలముకొని యున్నది. ఈ స్థితిలో ఆంధ్ర విద్యార్థులకు వెలుగు బాటలు యీ మహాసభ చూపుతుందని విశ్వసిస్తున్నానని అన్నారు

విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించాలి

శ్రీ ప్రతాప గిరిగారు మహాసభను ప్రారంభించుతూ "రాజకీయ స్వాతంత్ర్యము వచ్చినా మన సమస్యలు అలానే వున్నవి అవినూతనమైన సమస్యలు కాబట్టి నూతన దృష్టి. పట్టుదల, వుత్సాహం అవసరము. విద్యావిధానంగూర్చి మాట్లాడుతూ, ప్రజాస్వామికానికి అనుగుణ్యమైన విద్యావిధానం ప్రజాస్వామికంద్వారానే సాగుతుంది అది ప్రభుత్వ యత్నాలద్వారా వీటిని సాగించాలి విద్యార్థుల నుద్బోధించుచూ, "విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించాలి తేలికగా ఆలోచించటముకాదు తీవ్రంగా ఆలోచించాలి. ఇతరులిచ్చే అభిప్రాయం మాత్రము మీరు మింగకండి. మీ బుద్ధిని వుపయోగించండి" అని అన్నారు తరువాత జమీందారీ బిల్లుపైన, రాయలసీమ సమస్యపైన మాట్లాడారు.

తరువాత విద్యార్థి వుద్యమంలో సేవచేస్తూ అకాలమరణానికి గురి అయిన చిత్తరంజన దత్తు, కె కృష్ణరావు, సి హెచ్ హనుమంతరావు, ఆర్.జి కృష్ణమూర్తిగార్లకూ, కవికోకిల దువ్వూరి, సైగిల్, వినాయక్‌ల మరణాని సంతాపాన్ని వెలిబుచ్చుతూ, అధ్యక్షులు తీర్మానాన్ని ప్రతిపాదించారు దేశస్వాతంత్ర్య సంపాదనలో వీరస్వర్గ మలంకరించిన వీరయోధులకు జోహారులర్పించారు తరువాత నెహ్రూ గాంధి, ఆజాదులు చేస్తూన్న కృషికి అభివందనాలు అర్పించారు. సౌహార్ద ప్రతినిధిగా హాజరైన ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ మాజీ కార్యదర్శియు, యం బసవపున్నయ్యగారు మహాసభకుసందేశమిస్తూ, మహాసభముందున్న కర్తవ్యాలను వివరించారు,

కార్యదర్శి నివేదిక

ప్రధాన కార్యదర్శి శ్రీనల్లవరపు రా కృష్ణారావు, గత సంవత్సర విద్యార్థులు మహత్తర విజయాలు సాధించారనీ ఈ పోరాటలలో ఆంధ్రవిద్యార్థులు ఐక్యతను ప్రదర్శిం ప్రజాసేవలో ఐక్యత సాధ్యమనే సత్యాన్ని దా ఆంధ్రప్రజలకు, రాజకీయ పార్టీలకు మా దర్శకు లయ్యారని, అనేక ప్రదేశాలలో ఐ కమిటీలు ఏర్పడి ఐక్య విద్యార్థి వుద్యమా బాటను సుగమం చేస్తూన్నాయి. అంటూ గ సంవత్సర కార్యకలాపాలను సమీక్ష చేశారు.

తీర్మానాలపై చర్చలు.

శ్రీ వంగా సత్యనారాయణగారు రాజకీ తీర్మానం ప్రవేశపెట్టారు దేశంలో చెలరేగి మతకలహాలను తుదముట్టించి వీటి వెనుక వున్న అభివృద్ధి నిరోధకులను ఎదుర్కొ జాతీయ వునర్నిర్మాణ కార్యక్రమంలో ము డుగు వేయాలని, ఈ కార్యక్రమానికి పూ కుంటున్న నెహ్రూను విద్యార్థులు సర్వవిధా బలపరుస్తారని తీర్మానంలో వివరించబడిం

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి రాయ సీమ, సర్కార్ల ప్రజల ఐక్యత అవసరమ అందుకు ఆర్థికంగా వెనుకబడిన రాయలసీ వాసుల అభివృద్ధికి సర్కారుప్రజలు తోడ్ప

విద్యావిధాన సాధనామార్గం

మహాసభ సమీక్ష

(మా విలేఖరి)

లని, విశాలాంధ్ర నిర్మాణానికి పూనుకోవాలనే వివరాలతో కూడిన తీర్మానం బి. గోపాలకృష్ణగారు ప్రవేశపెట్టారు.

ఆర్. ఎస్. ఎస్. పైన, గుంటూరు విద్యార్థుల పోరాటంపైన, నూతనవిద్యా విధానంపైన, విద్యార్థి ఐక్యతపైన యింకా ఇతర సమస్యలపైన తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

ఆంధ్రయువజన ఫెడరేషన్‌కు రాష్ట్ర విద్యార్థి ఫెడరేషనును అనుబంధించుతూ తీర్మానించబడింది.

ఈ తీర్మానాల చర్చలలో అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు అతి ఉత్సాహంగా పాల్గొని తమ జిల్లాలలోని అనుభవాలను తీర్మాన విషయాలను జోడించి, చక్కటి ఉపన్యాసాలు ఇచ్చి, ప్రతినిధులకు కర్తవ్యాన్ని ప్రబోధించారు. విద్యార్థులు చర్చలలో చూపుతున్న పట్టుదల, దీక్షను చూచి, ప్రేక్షకులుగా వచ్చిన 'భీమవరపు ప్రజలు', విద్యార్థి కాంగ్రెసు విద్యార్థులు ముగ్ధులయ్యారు. ఇంత క్రమశిక్షణతో జరిగిన మహాసభల నెన్నడూ చూడలేదనితమ సంతోషాన్ని వెల్లడించారు. విద్యార్థి ఐక్యత, ఆర్. ఎస్. ఎస్. లపై తీర్మానాలు, విద్యార్థి కాంగ్రెసు విద్యార్థులను, ఆర్. ఎస్. ఎస్. యువకులను కదల్చివేశాయి. ఈ తీర్మానాల లోని సత్యాన్నిగూర్చి ఆలోచించసాగారు.

శ్రీ మారెళ్ళ నరసింహారావుగారిని అధ్యక్షులుగాను, శ్రీ గోపాలక్రిష్ణగారిని ఉపాధ్యక్షులుగాను, మల్లవరపు రామకృష్ణారావుగారిని ప్రధాన కార్యదర్శిగను, మాన్నె, దాసరి నాగభూషణరావుగార్లను సహాయ కార్యదర్శులుగాను, ఎన్. వి. నారాయణగారిని కోశాధికారిగాను, డి. చెంచురామయ్యగారిని ఆఫీసు కార్యదర్శిగాను మరి 16 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బహిరంగ సభ

8 వ తేది సాయంకాలం 4 గం. విద్యార్థులు బారులు తీరి క్రమశిక్షణతో సుశిక్షిత సైనికులవలె నడుస్తుంటే భీమవరపు వీధులకు నూతన శోభను చేకూరింది. గాంధీజీ జిందాబాద్, నెహ్రూప్రభుత్వాన్ని బలపర్చాలి, నెహ్రూ జిందాబాద్, మతకలహాలను అరికట్టాలి, రాయలసీమ సమస్యలో ఐక్యత నెలకొల్పాలి, విద్యార్థిఐక్యత నెలకొల్పాలి, జాతీయ విద్యా విధానం అమలు పర్చాలి. మొదలైన నినాదాలతో మహాసభా నిర్ణయాలు ప్రజలకు తెలియజేస్తూ, పురవీధులగుండా వూరేగింపు సాగిపోయింది. జయజయధ్వానాలతో సాయంకాలము 6. 30 గం. కు తాలూకాబోర్డు ఆఫీసు ఆవరణలో ఏర్పరచిన సభామంటపానికి వూరేగింపు చేరుకుంది. చుట్టుపట్ల గ్రామాలనుంచి అనేకమంది ప్రజలు మహాసభా సందేశం తెలుసుకునేందుకు బహిరంగసభకు హాజరయ్యారు. 3000 మంది ప్రజలు, విద్యార్థులు హాజరైనారు. మహాసభ వేదికపై శ్రీ మారెళ్ళ నరసింహారావు, రఫీ అహమ్మద్, మాధవపెద్ది వెంకట్రామయ్య, ఎస్. వి. నరసయ్య, మల్లవరపు రామకృష్ణారావుగార్లు ఆసీనులయ్యారు.

మహాసభకు ఆంధ్రరాష్ట్రవిద్యార్థిఫెడరేషన్ అధ్యక్షులు, అధ్యక్షత వహించారు. బహిరంగ సభను హైద్రాబాదు విద్యార్థి నాయకుడు, హైద్రాబాదు ప్రజా పోరాటానికి నాయకత్వం వహిస్తున్న వారిలోఒకరగు రఫీ అహమ్మద్ ప్రారంభించారు.

"భారత యూనియన్ శత్రువైన నైజాముతో మేము పోరాడుతున్నాం"

సభను ప్రారంభించుతూ రఫీగారిలా అన్నారు. మీరు "స్వతంత్రంపొంది స్వేచ్ఛావాతావరణంలో మహాసభ జరుపుతున్నారు. నేను నైజాం పాలనక్రింద బానిసత్వం అనుభవించుచున్న వ్యక్తిగా మీ ముందు నిలబడాల్సి వచ్చినందుకు విచారపడుతున్నాను. తరువాత నైజాంలోదుర్భరపరిస్థితులను వివరించుతూ వాటికి కారణాలు ఈ విధంగా చెప్పారు: "నైజాం ప్రజలను దోచుకుంటున్న 200 హిందూముస్లిం జాగీర్దార్ల, పెట్టుబడిదార్ల కుటుంబాలు నైజాంనవాబు అండతో పెత్తనం చేస్తున్నారు. హైదరాబాదును బ్రిటిషుసామ్రాజ్యవాదులు తమమిలటరీ సైనికకేంద్రంగా ఉపయోగించుకొని, భారతస్వాతంత్ర్యాన్ని అనాక్రమకం చేయాలని కుట్రపన్నారు. దానికొరకు నైజాంనవాబు ప్రజావుద్యమాలను అణచపూనుకున్నాడు. ప్రజాస్వామికానికి, పౌరసత్వాలకు, భారతయూనియన్ రక్షణకు జరుగు పోరాటం అని అన్నారు. హైద్రాబాదు ప్రజా పోరాటం హిందూ మహమ్మదీయ కలహం కాదనీ, ముస్లింప్రజలుకూడా హిందూప్రజలతో పాటు అతికష్టనష్టాలకు గురిఅవుతున్నారనీ వివరించారు. హైద్రాబాదు ప్రజా పోరాటం విజయంపొందితే విశాలాంధ్రను నిర్మించుకోగల్గుతాం. అని వుద్బోధించి ఆర్థికసహాయాన్ని అర్థించారు. సభలో వెంటనే రు 66-13-3 వసూలైనది.

తరువాత మల్లవరపు రామకృష్ణారావుగారు, ప్రముఖ కాంగ్రెసువాదులు పాకోడేటి సూర్యప్రకాశరావుగారు, బద్దం ఎల్లారెడ్డిగారు, పెంటపాడు ట్రయినింగుస్కూలు హెడ్మాష్టరుగారు పంపిన సందేశాలను చదివి, మహాసభ నిర్ణయాలను వివరించారు.

తరువాత శ్రీ ఎస్. వి. నరసయ్యగారు మాట్లాడుతూ, మనంసాధించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకొని, జాతీయపునర్నిర్మాణం అమలు పర్చేందుకు, అభివృద్ధినిరోధకులను, ఆర్. ఎస్. ఎస్. మొదలైన మతసంస్థల పలుకుబడినితుడిచిపెట్టాలని వుద్బోధించారు.

అధ్యక్షులు శ్రీ మారెళ్ళ నరసింహారావుగారు విద్యార్థిసమస్యలపై మాట్లాడి విద్యార్థులు ఐక్యమవ్వాలనిచెప్పుతూ తమ వుపన్యాసాన్ని ముగించారు.

వైజ్ఞానిక మహాసభ

వైజ్ఞానిక సభను శ్రీ మాధవపెద్ది వెంకట్రామయ్యగారు ప్రారంభించుతూ, బీదరైతుల దుర్భరదరిద్రగాధలను చిత్రించారు. కార్మికుల ఆకలి చిచ్చులు, పేదరికం నశించాలి. కళాకారులు యిలాచేసినపుడే దేశం కల్యాణవంతమవుతుంది. అని అన్నారు.

"వాస్తవంగా యిది విద్యార్థి మహాసభగా జరిగింది. దేశంలోనిసమస్యలు బహుచక్కగా చిత్రించి విద్యార్థులకు మార్గాన్నిచూపారు" అన్నారు. జూనియర్ స్కూళ్ళ ఇన్‌స్పెక్టరుగారు, 'మైనారిటీలమైన మమ్మల్ను రక్షించుతామని ముందుకువస్తున్న యిటువంటి సంస్థ ఉంటే మాకేంభయం' అన్నారు ముస్లిం యువకులు.

తరువాత జిల్లాదళాలచే వైజ్ఞానికప్రదర్శనాలు జరుపబడ్డాయి. తూర్పుగోదావరిజిల్లాదళం ప్రథమబహుమతి పొందింది. జయజయధ్వానాలతో సభ ముగిసింది.

ఆంధ్రదేశమంతటా యువజనవారం

"ప్రాణాలొడ్డయినా నెహ్రూప్రభుత్వాన్ని కాపాడుతాం"



నవంబరు 10 నుంచి 17 వరకూ 'అంతర్జాతీయ యువజనవారం' జరుపమని ఆంధ్ర యువజన ఫెడరేషన్ పిలుపునిచ్చింది. ఈ విధంగా మొదటిసారిగా అంతర్జాతీయ సౌభ్రాతృత్వం పెంపొందించే ఈవారం జయప్రదంగా జరపటానికి ఆంధ్ర యువకులు దీక్షవహించారు. సుమారు 100 గ్రామాలలో ఈ ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. అంతర్జాతీయ యువజనదినం (నవంబరు 10) నాడు అనేక చోట్ల యువకులు వలంటీర్లు బారులుతీరి విన్యాసం చేశారు. చైనా, స్పెయిన్, గ్రీసుదేశాల యువకులు సామ్రాజ్యవాదుల కెదురుగా చేస్తున్న పోరాటాలనభినందిస్తూ తీర్మానాలు చేశారు

నెహ్రూజన్మదినోత్సవంనాడు జరిగిన బహిరంగసభలో యువజనసంఘ వేదికపైకి కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు అందరూవచ్చి చాల చోట ఉపన్యసించారు ఉపన్యాసకులు నెహ్రూ ప్రభుత్వాన్ని పడగొట్టటానికి మతతత్వవాదులు అభివృద్ధినిరోధకులు చేస్తున్న కుట్రలను వివరించారు. ఈక్లిష్టపరిస్థితుల్లో దేశానికి నాయకత్వం వహించినడుపుతున్న నెహ్రూకు అభివందనాలు తెలియజేశారు. 'మా ప్రాణా లొడ్డయినా నెహ్రూప్రభుత్వాన్ని కాపాడుతాం' అనిశపథం చేశారు.

మొత్తం వార మంతా ఆటల, వైజ్ఞానిక పోటీలు జరుపుటలోను, బహిరంగసభలు జరిపి ప్రజల కర్తవ్యాన్ని ప్రబోధించుటలోను పెక్కు యువజన విద్యార్థిసంఘాలు నిమగ్నమైనాయి.

గోళ్ళమూడిపాడు

నవంబరు 10 యువజన దినోత్సవం సందర్భంలో జూపూడి, తాడిపర్రు, బ్రాహ్మణకోడూరు, గోళ్ళమూడిపాడు యువకులు 100 మంది వలంటీరు విన్యాసంజరిపారు. ఈ ప్రదర్శనం చూచిన ఒకరైతు తన పక్కవారితో "ఈ వాలంటీర్లంతా నైజాంవెళ్ళి అక్కడమనాళ్ళకి సాయంజేస్తే బాగుండును" అన్నాడు తర్వాతజరిగిన బహిరంగసభలో 7 తీర్మానాలు చేశారు. ఎ. సి. కాలేజీ ప్రిన్సిపాల్ చర్యలను ఖండించారు.

* 100 గ్రామాలలో
* **20000 ప్రజా సమీకరణతో**
* కాంగ్రెస్-కమ్యూనిస్టు ఐక్య సభలతో
* వాలంటీర్ విన్యాసాలతో
* వైజ్ఞానిక, ఆటల పోటీలతో

వైభవోపేతంగా జరిగింది

అంతర్జాతీయ యువజనవారం

కాకర్లమూడి

ఈగ్రామంలో జరిగిన యువజనోత్సవానికి దాదాపు 300 మంది హాజరయ్యారు.

కొల్లిపరలో జరిగిన బహిరంగసభలో శ్రీ బొల్లిముంత శివరామకృష్ణగారు ఉపన్యసించారు, ఈమని, కరెవరం గ్రామాలలో కూడా నవంబరు 10 దినోత్సవాలు జరిపారు.

ఉంగుటూరులోజరిగిన దినోత్సవంలో ఎ సి, కాలేజీ ప్రిన్సిపాల్ చర్యలను ఖండించారు.

నర్సాపురం తాలూకాలో చింతపర్రు, మట్టపర్రు, పుల్లంపర్రు, పోడూరు, పండితవిల్లూరు, వేమవరం, గరువుగ్రామాలలో యువజన దినోత్సవాలు జరిగాయి. పైసమావేశాలన్నింట్లోనూ సి. హెచ్. నారాయణరాజుగారు ఉపన్యసించారు

నెహ్రూ జన్మదినోత్సవాలు

అవనిగడ్డలో స్థానిక విద్యార్థి కాంగ్రెసు, విద్యార్థి ఫెడరేషను, యువజన కాంగ్రెసు, చేనేత, ఫ్యాక్టరీ కార్మికసంఘాల ఆధ్వర్యాన నెహ్రూ జన్మదినోత్సవం జరిపారు సభలో ఆంధ్రవిద్యార్థి కాంగ్రెసు కార్యవర్గ సభ్యులు టి. వి కోటేశ్వరరావుగారు, కృష్ణా జిల్లా విద్యార్థిఫెడరేషన్ ఆర్గనైజరు మాలెంపాటి నర్సయ్యగార్లు మాట్లాడారు.

పెనమకూరులో జరిగిన బహిరంగసభకు కాంగ్రెసువాది శ్రీ ఈడ్పుగంటి కోదండరామయ్యగారు అధ్యక్షత వహించారు. బెజవాడ తాలూకా యువజనసంఘ అధ్యక్షులు శ్రీ పిడికిటి గోపాలకృష్ణయ్యగారు ఉపన్యసించారు ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు నెహ్రూపండితుని 59వ జన్మదినోత్సవం అమితోత్సాహంతో జరిపారు.

నర్సరావుపేట పట్టణంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ యువకులంతా నెహ్రూ జన్మదినోత్సవ సందర్భంలో పాల్గొన్నారు బహిరంగసభలో పట్టణకాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ గిరిరాజు రంగారావుగారు, కమ్యూనిస్టు నాయకులు పి. వి. శివయ్యగారు మాట్లాడారు రేవేంద్రపాడు, చిలువూరు, గుత్తి గ్రామాలలో కూడా నెహ్రూజన్మ దినోత్సవాలు జరిపారు. దావులూరు పాలెంలో యువకులు వలంటీరు విన్యాసం జరిపారు.

బెజవాడ పట్టణంలో నవంబరు 16 వ తేదీన పెద్ద బహిరంగసభ జరిగింది. 2 వేల మంది ప్రజలు హాజరయ్యారు. సభలో ముస్లింలీగు, కమ్యూనిస్టుపార్టీ, నైజాం, విద్యార్థి ఫెడరేషన్ నాయకులు ఉపన్యసించారు అనంతపురంలో మొట్టమొదటిసారిగా కాంగ్రెసు, కమ్యూనిస్టులు, విద్యార్థి కాంగ్రెసు, విద్యార్థి ఫెడరేషన్ వారు ఐక్యంగా నెహ్రూ జన్మదినోత్సవం జరిపారు.

ఒంగోలు పట్టణ యువజనసంఘ ఆధ్వర్యమున నెహ్రూ జన్మదినోత్సవం జరిగింది. ఊరేగింపులో యువకులు కర్రసాము ప్రదర్శించారు, బహిరంగసభకు కాంగ్రెసు నాయకులు శ్రీ పెద్దిభట్ల రామచంద్రరావుగారు అధ్యక్షత వహించారు,

ఆగ్నేయాసియా యువజనమహాసభను జయప్రదం చేయండి

ఆంధ్రయువకులకు విజ్ఞప్తి

1947 నవంబరు 10 నాటికి అంతర్జాతీయ యువజనసమాఖ్య యేర్పడి రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ రెండు సంవత్సరముల కాలంలోను 64 దేశాలలో శాఖలతో 6 కోట్ల సభ్యత్వంతో ప్రపంచ యువకుల ఏకైక ప్రాతినిధ్య సంస్థగా అంతర్జాతీయ యువజన సమాఖ్య అభివృద్ధి పొందింది. ప్రపంచ యువజనుల ఐక్యతను భగ్నపర్చ అభివృద్ధి నిరోధకులు చేసిన కుట్రలెల్ల విఫలమయ్యాయి.

ప్రపంచ యువజనుల సమాఖ్య స్వతంత్ర దేశాల యువకుల హక్కుల విషయాలను మాత్రమే ఆలోచిస్తూ యూరకుండలేదు. పుట్టుకతోనే బానిసదేశాలలోని యువకుల విషయాలను పరిశీలించుటకు, బానిస ప్రజల స్వతంత్ర పోరాటానికి యితర దేశయువకుల సహాయ్య, సానుభూతులను సంపాదించుటకు. కలోనియల్ బ్యూరో, అనే ప్రత్యేక కమిటీని యేర్పరచింది. బాధ్యతల నిర్వహణ, భారతయువజన ప్రతినిధియైన మిస్. కెట్టి బుష్లా తీసుకొని పనిజేయవలయునని నిర్ణయింపబడింది. కొన్ని నెలల క్రితం ప్రపంచయువజన సమాఖ్య ప్రతినిధులుగా ఇండియా, బర్మా మలయా, ఇండోనేషియాలలోసంచారంజేసిన ప్రపంచ యువజన ప్రతినిధివర్గం యీ 'కలోనియల్ బ్యూరో' చొరవతో నిర్ణయింప బడినదే.

బానిసదేశాలకు తోడ్పాటు

సంపూర్ణ స్వతంత్రంకొరకు బానిసదేశాలు ముఖ్యంగా ఆశియాదేశాలు జరుపు పోరాటాలను సమన్వయపర్చుటకు యువజన సమాఖ్య కృషి సల్పుతుంది. ఆసియాదేశాలలోని ప్రజాబలాల ఉధృతంతో సామ్రాజ్యవాదులు ముఖ్యముగా ఇండియా, బర్మా, ఇండొనేషియా, వీయట్-నాం దేశాలలో పరోక్ష పరిపాలనకు ప్రయత్నాలు జేస్తున్నారని ప్రపంచయువజన సమాఖ్య గుర్తించింది. ఈ సామ్రాజ్యవాద కుట్రలను ఓడించుటకు యీ దేశాలలోని బలమైన యువజనోద్యమములను సమన్వయపర్చి నడపటం అతిముఖ్యం. ఇందుకుగాను ఆసియా ఖండములోని దక్షిణభాగంలోని దేశాలను కలిపి ప్రత్యేక యువజన మహాసభను జరపాలని 6 మాసములనాడు నిర్ణయించారు.



ఆగ్నేయ ఆశియా యువజనోద్యమంలోకెల్ల బలీయమైన ఇండొనేషియా యువకుల ప్రదర్శన

సామ్రాజ్యవాద దోపిడికి వ్యతిరేకంగా ఆశియాఖండంలోని మానవజాతి అంతా బ్రహ్మాండమైన పోరాటాలు జరుపుతున్నారు తమ స్వాతంత్ర్య పోరాటాలను ముందుకు గొంపోవుటకు ఆశియా దేశాల ప్రజల ఐక్యత అత్యవసరమని భావిస్తున్నారు. ఆశియాఖండంలోని ప్రతిజాతి పొరుగు ఆశియా దేశస్తుడు తన సోదరుడు, తనతోపాటు సామ్రాజ్యవాద దోపిడికి గురిఅవుతున్నాడనే భావం ఆశియా ఖండవాసు లందరిలోను వ్యాపించియుంది. ఈ చైతన్యంతో ప్రపంచ యువజన మహాసభ ప్రతిపాదనను ప్రతిఒక్కరూ ఆహ్వానించారు.

ఆగ్నేయ ఆసియా మహాసభ

ఈ ఆగ్నేయ ఆసియా యువజన మహాసభ మొదట ఇండొనేషియాలో జరుప నిర్ణయింపబడింది. కాని డచ్చి సామ్రాజ్యవాద దురాక్రమణతో ఇండొనేషియాలో యీ మహాసభ జరిపే పరిస్థితులు సన్నగిల్లాయి పైపెచ్చు, డచ్చి, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు ఇండోనేషియా, వియట్‌నాం దేశాలపై సాగిస్తున్న దారుణ హత్యాకాండలే ఆశియాదేశ యువజన మహాసభను అతితొందరలో జరపాల్సిన పరిస్థితు లేర్పరుస్తున్నాయి. అందుచేత ప్రపంచ యువజన సమాఖ్య ఈ ఆగ్నేయ ఆశియా యువజన మహాసభను ఇండియాలో జరుప నిర్ణయించింది.

ఈ ఆగ్నేయ ఆసియా యువజన మహాసభలో పాల్గొనే దేశా లేవి? ఇండియా, బర్మా, సింహళం, సయాం, వియట్‌నాం, ఇండొనేషియా, మలయా. పాకిస్థాన్ దేశాల యువజన సంస్థలు తమప్రతినిధులను పంపి అధికారీత్యా సమావేశంలో పాల్గొంటారు. కుమిన్‌టాంగ్ చైనా, విముక్తచైనా, సోవియట్ ఆసియా, అరబ్బుదేశాలు ఈజిప్టుమున్నగు ఇతరఆసియా దేశాలనుండి ప్రేక్షకులు హాజరు అవుతారు. ఇంతేగాదు ప్రపంచంలోని ఇతర యువజన సంఘ ప్రతినిధులు ముఖ్యంగా ఇంగ్లండు.

(మిగతా 17వ పేజీలో)

అర్ధసంవత్సరం గడచినా ఉపాధ్యాయులు లేరు

డి. సి. ఆర్.

కృష్ణాజిల్లా తిరువూరు హైస్కూలు విద్యార్థి ఫెడరేషన్ - విద్యార్థి కాంగ్రెస్-రాజకీయాభిప్రాయబేధాలు పాటించకుండా ఇద్దరూ కలసి సంయుక్త సమావేశం జరిపారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక విద్యార్థి ఫెడరేషన్ నాయకులు శ్రీ కొల్లా నరసింహారావుగారు విద్యార్థిఉద్యమ ఐక్యతను గూర్చి మాట్లాడారు. తరువాత ఈ క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

1. విద్యార్థి సమస్యల పరిష్కారానికి విద్యార్థిఫెడరేషన్ - కాంగ్రెసుఐక్యత అవసరం
2. డిటెన్షన్ విధానాన్ని నిర్మూలించాలి.
3. 10 వ నెల జీతాన్ని రద్దుచేయాలి
4. ఏ సి. కాలేజి విద్యార్థుల పోరాటాన్ని బలపరుస్తూ తీర్మానాలు చేశారు.

నరసాపురం హైస్కూల్లో భోజనశాలలు లేవు-ఉర్దూసెక్షన్ రద్దు

నర్సాపురంలో స్కూలు స్థాపించబడిన నాటినుండి ముస్లింలకు ఉర్దూ చదువుకునే అవకాశం కలిగించబడింది కాని ముస్లిమ్‌కిఇచ్చేజీతం చాలక ఆ ఉపాధ్యాయుడు ఉద్యోగంనుండి విరమించాడు అందుచేత ఉర్దూసెక్షన్ రద్దుచేయబడింది ఉర్దూలో చదువుతున్న విద్యార్థులు బాధపడుతున్నారు."చేంతాడు లేదని నుయ్యి పూడ్చినట్లుంది" వింతధోరణి. పైగాఅన్నంతినుటకు ప్రత్యేకశాలలేమీ లేకపోవుటంవల్ల,అన్నమంతా కాకుల, కుక్కల, పాలుగావలసి వస్తుంది. స్వతంత్ర దేశంలోకూడ విద్యార్థులు ఇట్టి కష్టాలకు పాలుపడవలసిందేనా! వెంటనే అధికారులు ఈ విషయాన్ని చక్కపర్చాలి.

విద్యాలయాధికారుల నిర్లక్ష్యత

అనంతపురం కాలేజీతెరచి నేటికి రెండు నెలలైనను ఇంతవరకు లెక్చరర్లు(Lecturers) అందరూరాలేదు. చరిత్ర బోధించేవారు లేకపోవటంవల్ల, సీనియర్, జూనియర్ విద్యార్థులకు పాఠాలు కాలేదు.

జూలైలో పై విషయాన్ని విద్యార్థులు మెమోరాండంద్వారా విద్యాశాఖాధికారులకు సమర్పించారు. కాని విద్యాశాఖాధికారికి ఈ ఆందోళన "చెవిటివానిముందు శంఖం ఊదినట్లయింది." విద్యాక్షీణతకు కారణం యిట్టి అవకతవకలేవనీ, విద్యార్థులు చేసేసమ్మెలు కావని విద్యాశాఖమంత్రి గుర్తించాలి. పరీక్షలు దగ్గరకొస్తున్నాయ్ ఇ కొద్దిరోజుల్లో లెక్చరర్లు రాకపోయినచో సమ్మెద్వారావిజయం సాధించాలను కుంటున్నారు.

అర్ధసంవత్సరం గడచినా ఇంతవరకు ఉపాధ్యాయులు లేరు

వేటపాలెం స్కూలును ఈసం॥ హైస్కూలు చేశారు. అర్ధసంవత్సరం గడచినా ఇంతవరకు ఉపాధ్యాయులురాలేదు దీనిఫలితంగా క్వార్టర్లీ పరీక్షలు జరగలేదు. జాగ్రఫీ యల్ టి.లు ఇంకా కొంతమంది లేకపోవటంవల్ల, 5, 6 ఫారములకు వారమంతా ఖాళీ గా నే యుంటున్నది. పైగా సరిఅయిన గదుల వసతిలేదు ఒక గదికి మరొకగదికి అడ్డము లేదు. దీనివల్ల పాఠాలు చెప్పేటపుడు గోలగా ఉంటుంది. ఇంకాచూస్తే సరి అయిన (play grounds)లేవు ఉన్నవాటిల్లో పల్లేరు కాయలున్నాయి. ఈ విధంగా విద్యాలయాలుంటే చదువుకోటానికి కష్టతర మవుతుందని వేరే చెప్పనక్కరలేదు. కావున కమిటీవారు, విద్యాలయాధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని పనిచేస్తారని ఆశించవచ్చునా!

* * *

చీరాలబోర్డు హైస్కూల్లో ఇంతవరకు కెమిస్ట్రీ మాష్టరుగారు లేరు. 5, 6 వ ఫారాల విద్యార్థులకు ఇంతవరకు కెమిస్ట్రీ, ఫిజిక్సులలో పోర్షన్లు కాలేదు కావలసిన రసాయనిక సామానులు, నిరుడు రావలసినవి ఈ సంవత్సరం వచ్చినవి అవి అయినా అవసరమైనవిరాలేదు. కాబట్టి బోర్డువారు శ్రద్ధతీసి కొంటారని ఆశిస్తున్నాం.

సమ్మె పరంపరలు

దుగ్గిరాల హైస్కూలు విద్యార్థులు డిటెన్షన్ విధానానికి ఏ సి. కాలేజీ విద్యార్థుల పోరాటానికి సానుభూతిగా సమ్మెచేశారు.

* * *

రేపేంద్రపాడులో విద్యార్థులు నెహ్రూజన్మదినోత్సవ సందర్భంలో సమ్మెచేశారు. దానికి ఆ హైస్కూలు హెడ్మాష్టరుగారు ఇద్దరిని స్కూలునుండి వెళ్ళగొట్టాడు. ప్రధాని జన్మదినోత్సవం జరిపినందుకు బహుమతిగా ప్రసాదించాడు. ఇది ఎంత సమంజసమో చూడండి

* * *

చల్లపల్లి విద్యార్థులు ఈ సంవత్సరం అప్పుడే ఒక ఐక్యకార్యాచరణ సంఘాన్ని ఏర్పరచి డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగాను, ప్రయివేటు విద్యార్థులకు అటెండెన్సు ఇవ్వాలనే ఆందోళనతోనుసమ్మెసాగిస్తున్నారు స్కూలు, మూసివేసినట్లుప్రకటించబడింది కాని విద్యార్థులు ద్విగుణీకృతోత్సాహంతో వారి కోర్కెలు నంగీకరించేదాక సమ్మె సాగిస్తామనే నిశ్చయంతోఉన్నారు. ఇంకా సమ్మె జరుగుతోంది.

నిడదవోలు హరిజన హాస్టలు విద్యార్థుల విజయం

నవంబరు 2 వ తేదీన హరిజన హాస్టలు విద్యార్థులు శింగవరంలో జరిగిన షెడ్యూల్ కాస్టు ఫెడరేషన్ సభకు వెళ్ళారనే నెపంతో, జిల్లా హరిజన సేవాసంఘ కార్యదర్శి తాడిమేటి కుటుంబశాస్త్రిగారు ఒక్కొక్క విద్యార్థికి రెండు రూపాయలు జరిమానా విధించాడు. పైగా తలిదండ్రులను క్షమాపణ చెప్పుకోమన్నాడు. కాని తలిదండ్రులు వెళ్ళి జరిమానా చెల్లించుతామనిచెప్పినా ఒప్పుకోలేదు. తరువాత తలిదండ్రుల సంఘం పరిష్కారానికి కృషి చేసింది దాని ఫలితంగా వారిని హాస్టలులో చేర్చుకొన్నాడు. (ఎట్టిచర్యా తీసుకోకుండా)

రాష్ట్రవ్యాపితంగా ఆటల పోటీలు

కె. పి. జి.

అంతర్జాతీయ యువజన వారం సందర్భంలోనూ అంతకుముందూ రాష్ట్రంలో అనేక చోట్ల యువజన సంఘాల ఆధ్వర్యాన ఆటల వైజ్ఞానిక పోటీలు జరిగాయి. ఇంతవరకు మా కార్యాలయంకు చేరిన వార్తలనుబట్టి 4 తాలూకాలలోను, మరియేడు గ్రామాలలోను ఆటల పోటీలు జరిగాయి. ఇందులో మూడుచోట్ల వైజ్ఞానికపోటీలు జరిగాయి.

ఈసంవత్సరం ఆటల పోటీలలో ప్రత్యేకత ఏమిటంటే ఇదివరకెన్నడూ పాల్గొననంత మంది వ్యవసాయకూలీ యువకులు ఈ సంవత్సరం పాల్గొన్నారు. ముఖ్యంగా గన్నవరం, దివి తాలూకాలలో ఈవిషయం స్పష్టంగా కనిపిస్తుంది. అంతేగాదు 1942లో యువజనోద్యమములో చీలికలేర్పడిన తరువాత తిరిగి రాజకీయ భేదాభిప్రాయాలను విస్మరించి. కాంగ్రెసు, కమ్యూనిస్టు ఇతరపక్షాల యువకులు పెద్దఎత్తున ఆటలపోటీలలో పాల్గొంటానికి ఈ సంవత్సరం ముందుకు వచ్చారు ఈవిషయంలో గన్నవరం తాలూకా యువకులు ఆంధ్రదేశానికి ఆదర్శప్రాయులు అయ్యారు యువజనోద్యమంలో విస్తరించుతున్న ఈ ఐక్యచైతన్యం భవిష్యత్తులో ఐక్యయువజనోద్యమానికి శుభసూచకం. ఈ నూత్నచైతన్యాన్ని ఆంధ్రయువకులు మరింత ముందుకు తీసుకుపోవాలి.


గన్నవరం తాలూకా

7 వ గన్నవరం తాలూకా ఆటలపోటీలు 5 వ వైజ్ఞానికపోటీలు నవంబరు 3, 4, 5 తేదీలలో ముస్తాబాదలో జరిగాయి మొత్తం 20 గ్రామాలనుంచీ 24 చెడుగుడు టీములు పాల్గొన్నాయి జనరల్ స్పోర్ట్సులో 30 మంది యువకులు పాల్గొన్నారు. చెడుగుడు పోటీలో తిప్పనగుంట టీము విన్నర్సుగాను, కాటూరు టీము రన్నర్సుగాను వచ్చాయి.

దివి తాలూకాలో

దివితాలూకా ఆటల, వైజ్ఞానిక పోటీలు నవంబరు 10 నుండీ 13 వరకు శ్రీకాకుళంలో జరిగాయి, 14 చెడుగుడు టీములు పాల్గొన్నాయి 30 మంది యువకులు జనరల్ స్పోర్ట్సులో పాల్గొన్నారు.

శ్రీకాకుళం ప్రాంతం రాజకీయంగా వెనకబడినది. ఇంతవరకూ యువజనోద్యమంతో పెద్ద సంబంధం లేదు. అయినప్పటికీ చుట్టుప్రక్కల గ్రామాల యువకులూ పెద్దలూ ఎంతో ఉత్సాహంతో వీటిలో పాల్గొన్నారు. బారుదూకటలో 40 సంవత్సరాల రైతు దాకరాల నాగేశ్వరరావుగారు పాల్గొని రెండవవారుగా రావటం యువకులనెంతో ఉత్సాహపర్చింది అరమైలు ఈతలో 12 సంవత్సరాల బాలుడు అందరినీమించి మొదటివాడుగ వచ్చాడు, చెడుగుడులో చిట్టూరు టీము



నర్సరావుపేటలో జరిగిన ఆటల పోటీలోని చెడుగుడు పోటీ దృశ్యం

విన్నర్సుగానూ, ఇస్మాయిల్‌బేగ్ పేటవారు రన్నర్సుగానూ వచ్చారు

తాడేపల్లిగూడెం తాలూకాలో

అంతర్జాతీయ యువజనవారం సందర్భంలో నవంబరు 13, 14 తేదీలలో దరిశపర్రు గ్రామములో ఈ తాలూకా ఆటల పోటీలు జరిగాయి. 16 గ్రామాలనుంచీ 20 చెడుగుడు టీములు పాల్గొన్నాయి. దర్శిపర్రు టీము ప్రధమంగానూ పెంటపాడు టీము ద్వితీయంగానూ వచ్చాయి

చింతలపూడితాలూకా

నవంబరు 6, 7, 8, తేదీలలో చింతలపూడిలో చెడుగుడు ఆటల పోటీలు జరిగాయి. 10 టీములు పాల్గొన్నాయి ప్రధమంగా చింతలపూడి ఎథెలిటిక్ ఎసోసియేషన్, ద్వితీయంగా యువజన కాంగ్రెసు నెహ్రూ టీము (ధర్మాజీగూడెం) గెలుపొందాయి బాలసంఘ పోటీలలో చింతలపూడి హైస్కూలు విద్యార్థులు గెలుపొందారు.

టంగుటూరులో

నవంబరు 9 10, తేదీలలో గ్రామ యువజనసంఘ వార్షికోత్సవ సందర్భంలో జరిగిన ఆటల పోటీలలో 11 చెడుగుడు టీములు పాల్గొన్నాయి సవిష్టి. వ్యష్టిగానాల పోటీ కూడా జరిగింది

కొల్లిపరలో

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంలో నవంబరు 10 న గ్రామ ఆటలపోటీలు జరిగాయి. 5 టీములు పాల్గొన్నాయి.

భట్టిప్రోలు

నవంబరు 1వతేదీనుండీ 6 వ తేదీ వరకూ జరిగిన ఆటల పోటీలలో 32 చెడుగుడు టీములు పాల్గొన్నాయి వెల్లటూరు 'రెడార్మీ A' టీము ప్రధమంగా వచ్చింది

ఈమని

గ్రామ యువజనసంఘం నవంబరు 10, 11, 12, తేదీలలో జరిపిన ఆటల పోటీలలో 6 టీములు పాల్గొన్నాయి; నెహ్రూటీము ప్రధమంగానూ, రెడార్మీ టీము ద్వితీయంగానూ వచ్చాయి.

నర్సరావుపేట

నెహ్రూ జన్మదినోత్సవ సందర్భంలో నర్సారావుపేట మున్సిపల్ హైస్కూలు ఆవరణలో చెడుగుడు పోటీలు జరిపారు. 14 టీములు పాల్గొన్నాయి

పెనమకూరు

నవంబరు 10 వ తేదీ నుండి 14 వ తేదీ వరకు జరిగిన ఆటల పోటీలలో చుట్టుప్రక్కల 10 గ్రామాలనుంచీ అన్ని రాజకీయ పక్షాలకు చెందిన 19 టీములు పాల్గొన్నాయి. 'లెనిన్ మెమోరియల్' చినవోగిరాల టీము ప్రధమంగానూ, 'కోడి రామమూర్తి మెమోరియల్' తోట్లవల్లూరు టీము ద్వితీయంగానూ వచ్చాయి.

కరెవరం

యువజనవారం సందర్భంలో ఈత, పరుగు త్రాడులాగుట బరువులెత్తుట సైకిల్ పందెము మొదలైన జనరల్ స్పోర్ట్సు జరిపారు.

మచ్చు తునకలు ★ ★ చిచ్చు రవ్వలు

'ఆంధ్రవిద్యార్థి' అను పక్షపత్రిక శ్రీ ఎ. ఎస్. ఆర్. కృష్ణ సంపాదకత్వాన విద్యుల్లోలనుండి వెలువడుతోంది. ఇప్పటికి 4 సంచికలు వెలువడినాయి. ప్రథమ సంపాదకీయంలో విద్యార్థిలోకానికి [illegible] వది అని తెల్పుతూ, ఆంధ్ర విద్యార్థి కాంగ్రెసు ప్రతిచర్యకు చేదోడువాదోడుగా 'ఆంధ్రవిద్యార్థి' వుంటుందని వెల్లడి చేశారు

మురారాజకీయాలకు విద్యార్థి ఐక్యతా వ్యతిరేక విచ్ఛిన్నవిధానాలకు పేరుమోసిన ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి కాంగ్రెసు (సుందరవర్గం) నాయకులకు చేదోడువాదోడుగా 'ఆంధ్రవిద్యార్థి' వెలబడి, తన ఆశయాన్ని సార్థకం చేస్తోంది. ధన్యహో! అభినందనం! ఆంధ్ర విద్యార్థి కాంగ్రెసు కార్యదర్శిగా పనిచేసి విచ్ఛిన్నకర మురా రాజకీయాలను విద్యార్థి కాంగ్రెసులో చొప్పించి, విద్యార్థికాంగ్రెసును బద్దలుకొట్టిందు తిరిగి ఆరాజకీయాలను మీ పత్రికలో ప్రతిబింబింప చేయుచున్నారు ఇందుకొరకు సత్యాన్ని మరుగుపర్చుతున్నారు విద్యార్థి ఉద్యమ చరిత్రను 'మసిపూసి మారేడుకాయ' చేయుటకు భగీరథయత్నాలు చేస్తున్నారు అది సాధ్యమా: 'ఆంధ్రవిద్యార్థి' లోని మచ్చుతునకలు చూడండి

గుంటూరు హాస్టల్ విద్యార్థుల కోర్కెలకై జరిపిన సమ్మెనుగూర్చి యీ విధంగా వ్రాశారు "విద్యార్థి కాంగ్రెసు వెంటనే కష్టంలోవున్న సోదర విద్యార్థుల ఆర్తనాదాన్ని అందుకొంది. హాస్టలు విద్యార్థుల నుండి 5 గురు సభ్యులతో కార్యాచరణ సంఘాన్ని నిర్మించింది సమ్మె కొనసాగింపటానికి కృతనిశ్చయులైనారు సమ్మె జరిగింది"

భేష్! సంపాదకులు 'బెమ్మి తిమ్మినిగా చిత్రించటంలో ప్రవీణులు కష్టంలో వున్న సోదర విద్యార్థులను మురారాజకీయాలకు ఉపయోగించుకుందామని గుంటూరు విద్యార్థి కాంగ్రెసు నాయకులు (సుందరవర్గం) ఏమి చేశారు విద్యార్థి కార్యాచరణ కమిటీని గుర్తించటానికి తిరస్కరించారు పట్టణ కార్యాచరణకమిటీ ఆధ్వర్యాన పోరాడి [illegible] సమ్మె అంతా విద్యార్థి కాంగ్రెసుదే అంటే సరిపోతుందా? విద్యార్థులు గుర్తించరా?

"మొదట్లో సమ్మెలో పాల్గొన్న నెపాన [illegible] గౌరవిస్తాడు" అని మాటవరసకు [illegible] నవంబరు 15 ఆంధ్ర 'విద్యార్థి' ప్రకటించారు. గుంటూరు విద్యార్థుల ప్రేమను చూరగొన్న విద్యార్థినాయకుడు శ్రీ నాగభూషణరావు కొరకు యితర హాస్టళ్ళలో కూడా సమ్మె జరిగిందని స్పష్టం చెప్పలేదేమి? తెలుగున ఏకైక విద్యార్థి ప్రాతినిధ్య సంస్థ అయిన పట్టణకార్యాచరణ సంఘ కార్యకర్తల ఉద్రేకం కాదోలు

సమ్మెపట్టణ కార్యాచరణసంఘ ఆధ్వర్యాన జయప్రదంగా సాగుతోంది. అక్టోబరు 28 న యీ కమిటీ ఏర్పాటుచేసిన బహిరంగసభలో రాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ - విద్యార్థికాంగ్రెసు ప్రతినిధులు మాట్లాడారు దీనిని కప్పిపుచ్చి విద్యార్థికాంగ్రెసు ఏర్పరచిన పోటీ కార్యాచరణ కమిటీ సమ్మెనడుపుతున్నట్లు చిత్రించారు. పట్టణ కార్యాచరణ కమిటీ మీటింగులకు వందలసంఖ్యలో విద్యార్థులు హాజరవుతున్నారు కాని ఏ [illegible] పెట్టిన పోటీ కమిటీకి 40 మంది హాజరు! సంపాదకులకు ఈ విషయాలు తెలియనివి కావు. వారుకూడా యీ మీటింగులలో ప్రేక్షకులే!

"[illegible] గూర్చి వ్రాస్తూ" కార్యక్రమం ప్రకారం సాయంకాలం 4-30 కు డిమాన్‌స్ట్రేషన్ 5 గం॥ సభజరిపారు" అన్నారు. ఆ కార్యక్రమం ఎవరిది? ఎవరునడిపారు? పత్రికలో అందిస్తున్న చిచ్చురవ్వలు చల్లి మచ్చుతునకలు కరిగించి కల్తీసరుకు తేలగించారు. ఇలతీకే కారణంతెలుసా? మురా రాజకీయాలు! నాయకత్వాలకు వ్యామోహం! ఐక్యతా వ్యతిరేకధోరణి! చరిత్రకు వక్రభాష్యం చెప్పేగుణత్వం! ఆంధ్రవిద్యార్థులు ఈసత్యాన్ని గుర్తించి తగునమాధానం చెబుతారు.

— అగ్నికణం —

(6 వ పేజీ తరువాయి)

టున్నామని స్పష్టపర్చే ధైర్యమే వీరికి లేకపోయింది. బందరు ప్రెస్సుపాలును కొట్టినట్లయిన ఎందుకు పోలీసుకేసుపెట్టరాదని విద్యార్థి ఉద్యమం యిచ్చిన సవాల్‌ను సహితం స్వీకరించే సాహసం విశ్వవిద్యాలయాధికారులకు, సి ఆర్. రెడ్డికి లేకపోయింది. ఈ పిరికితనమే విశ్వవిద్యాలయాధికారుల కుట్రను బట్టబయలు జేస్తుంది.

తమ యీ నిర్బంధ చర్యలకు విద్యార్థులు హడలిపోతారని, నూతన విద్యా విధానానికి వారు జరిపే పోరాటాలు వదిలేస్తారని ఆశించిన అధికారులకు- శ్రీ నాగభూషణరావు సమస్యపైన ఆంధ్ర విద్యార్థులు ప్రారంభించిన ఆందోళన తలనొప్పి కారణమయింది విశ్వవిద్యాలయాధికారుల యీ నిర్బంధ విధానాన్ని ఓడించుటకు నేటి ఆందోళనను ద్విగుణీకృతం జేయాలి విశ్వవిద్యాలయ అధికారుల, సైప్పు కుట్రలను బట్టబయట జేయాలి విద్యాశాఖ మంత్రి కదలి యీ విషయంలో కలుగజేసుకొనునట్లు శ్రీ నాగభూషణరావుపై విధించిన ఆంక్షను రద్దుజేయునట్లు విద్యార్థి యువజన ఉద్యమాలు కృషిసల్పాలి

డిశంబరు 12 వ తేదీ వాల్తేరులో విశ్వవిద్యాలయ సెనేటు సమావేశమవుతుంది అందులో సిండికేటు చర్యను ఆమోదించుటకో, తిరస్కరించుటకో తేలనున్నది ఆనాటికి ఆంధ్రదేశ మంతటినుండి తీర్మానములు, టెలిగ్రాములు, మహజర్లు, లేఖలు వర్షంవలె కురిపించి ఆంధ్ర ప్రజావుద్యమాల శక్తిని ప్రదర్శించి, శ్రీ నాగభూషణరావుపై ఆంక్షను తొలగించునట్లు జేయవలసియుంది. సెనేటు సమావేశానికి ఆంధ్ర దేశంలోని వివిధ విద్యాలయాలనుండి విద్యార్థులు వాల్తేరు వచ్చి ప్రదర్శనలు జరిపి అధికారుల చర్యలను ఖండించవలసి యుంది

శ్రీ నాగభూషణరావు సమస్య ఒకవ్యక్తి జీవితానికి సంబంధించిందిగాదు. మన విద్యార్థి ఉద్యమ భవిష్యత్తును నిర్ణయించ నున్న సమస్యయిది నేటి విశ్వవిద్యాలయ ఆంక్షను ఎంత త్వరలో రద్దుజేయించ గల్గిన—అంత త్వరలో విద్యాలయాలలోని నిర్బంధ విధానానికి, విద్యా పునర్నిర్మాణానికి వ్యతిరేకంగా అభివృద్ధి నిరోధకుల కుట్రలను నిరోధించ గల్గుతాం.

నైజాంవ్యతిరేకపోరాటంలో యువకులపాత్ర

రిపబ్లిక్ స్థాపనతో నూతనఘట్టం

నైజాంలో అనేక జాగీరు లున్నాయి. ఈ జాగీరుల నిరంకుశపాలన కంతూ,పంతూలేదు. వీటిలో నందిగామతాలూకా సరిహద్దున వున్న పరిటాల జాగీ రొకటి ఈజాగీరుకు చుట్టు ప్రక్కలంతా ఇండియన్ యూనియన్ ప్రాంతం అయినా, విర్భీతిగావెట్టి, దౌర్జన్యాలు సాగుతూనే వున్నాయి. జాగీరు మొత్తం ఆదాయం 60 వేలరూపాయలు అయితే విద్యకు ఖర్చుపెట్టేది చాలతక్కువ. జాగీరుమొత్తంలో 5 ప్రాథమిక పారశాలలున్నవి వీటిలోనైనా 3 వ తరగతికి మించి వుండరాదు ఈ స్కూళ్ళలో చదువు కొని అభివృద్ధి పొందిన యువకు డొక్కడైనా లేడు. ఏదయినా జబ్బుచేస్తే ఇళ్ళి చావాల్సిందే గాని మందులుమాత్రం శూన్యం జాగీరంతటి లోనూ ఒక్కహాస్పిటల్ అయినా లేదు.ఇక వెట్టి చాకిరికి అంతేలేదు అధికారులకు కొళ్ళునైతం పినకాలంటే,ఎంతబానిసబ్రతుకో ఆలోచించండి. సంస్థానమంతటా జరిగే వీరోచిత పోరాటం యిక్కడి యువకులనుకూడా ఉత్సాహపర్చింది. నిద్రాణమై వున్న యువకులు మేల్కొన్నారు. భారతదేశం అంతటా అగస్టు 15 న యూని యన్ పతాకం ఎగురుతోంటే ఇండియన్ యూనియన్ మధ్యలో నున్న కొడవటిగల్లు (పరిటాల జాగీరులోని గ్రామము) యువకులు మాత్రం వెనుకబడతారా? జండా నెగురవేశారు. ఏ శాసనాలూ అడ్డురావని చాటారు. ఈ జాగీరు సబ్-యినస్పెక్టరుకు, డి యస్ పి ప్రజా చైతన్యాన్ని అతిదారుణంగా అణుచుటకు సర్వాధికారాలిచ్చి పంపారు ఆ అధికార మధాంతతో పరవళ్ళు తొక్కుతూ గ్రామాలవెంట దౌర్జన్యాలకు బయల్దేరాడు. వెనుకటి రోజులా యివి, సహించడానికి? 23—8—47 న సాయంకాలం తప్పతాగి వచ్చాడు కొడవటిగల్లు యువకుల ప్రచార ఫలితంగా యిక్కడ వెట్టిచాకిరీ మానడం చీమలు, జెర్రులు పాకినట్లయింది. ఒక్కొక్క రిని పిలిచి దారుణంగా కొట్టట మారంభించాడు. యువకులంతా వచ్చారు వెంటనే [illegible] ఆయనతోవచ్చిన ఇద్దరు ముగ్గురు పోలీసులకు బుద్ధిచెప్పి దౌర్జన్యాలను అరికట్టాలని గ్రామస్థుల పట్టుబడింది. [illegible] జాతీయ జెండా ఎగుర వేసినవారిని అరెస్టుచేయడానికే వచ్చి[illegible] సంకెళ్లు కూడ తెచ్చారు. [illegible] కల్లలయ్యాయి. దేహశుద్ధి జరిగేసరికి బ్రతుకు జీవుడా అని బయట పడ్డారు యువకులు విజయం సాధించారు పెద్దలందరు [illegible] అయ్యారు. రిపబ్లిక్ ను స్థాపించాలని యాక్షన్ కమిటీ నెన్నుకొన్నారు [illegible] నిర్మాణానికి పునాదులు [illegible],

అట్లూరి పూర్ణచం[illegible]

ముందు ఏర్పడబోయే ప్రజా ప్రభుత్వానికి నాందిగా అన్నట్లు ప్రజారాజ్య స్థాపన [illegible] పట్టుదలతో కార్యక్రమ [illegible] పడవపాటలద్వారా వచ్చే రు 100 [illegible] జమ కట్టారు. ప్రజలంతా విరివిగా విరాళా లిచ్చారు. తమ సర్వస్వాన్ని ధారబోసి రిపబ్లిక్ను కాపాడుకోవాలనే పట్టుదల ప్రతి వారిలోను ద్యోతకమవుతోంది. 4 గురు ముస్లిం సోదరులుకూడ విరాళాలివ్వడం గమనించదగ్గ విషయం,

ఈ సమయంలో కొందరు స్వార్థపరులు, లంచగొండి ఉద్యోగులు [illegible] గొట్టి జూస్తున్నారు.దౌర్జన్యాలకు [illegible] వకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని మత కలహాలుగా మార్చాలని నిరంకుశోద్యోగులు చూడడం సహజమే అట్టి ఎత్తులను [illegible] మోసపోరు. మల్లెపల్లి (ఈ జాగీరులోనిదే) కాంగ్రెసుకు ఒక ముస్లిం సోదరుడు [illegible] విరాళమిస్తే దానిని నోట్ చేసి, డి. యస్. పి.కి రిపోర్టుపంపిన విషయం [illegible] దొరికింది, ఈ నిరంకుశ పాలన [illegible] టలో మతభేదాలు అడ్డురాగూడదు ఈజాగీరులో [illegible] ముస్లిములు కూలీలే భూమి లేదు రెక్కాడితేగాని డొక్కాడని స్థితి. ఆ ముస్లిం సోదరులంతా యీ లంచ గొండి ప్రభుత్వం పోవాలనే కోరుతారు. స్టేటు కాంగ్రెసుకు విరాళాలివ్వడం యీ విషయాన్నే రుజువు చేస్తోంది. కొడవటిగల్లులోకూడ పోరాటనిధి వసూలుజేసి నప్పుడు 4 గురు ముస్లింసోదరులు విరాళాలి వ్వడం పోరాటస్వభావాన్ని తెలుపుతోంది

[illegible] మొహియుద్దీన్ లాంటి నాయకులు ఈ స్టేట్ పోరాటాన్ని నడిపేవారిలో వుండగా, [illegible] లాంటి విద్యార్థివీరుల నాయ కత్వాన విద్యార్థి పోరాటం జరుగుతుండగా మతకలహాలుగా మార్చి [illegible] సాగించాలని [illegible] తప్ప మరొకటి కాదు నిరంకుశ పాలనకు ప్రజాపాలనకు మధ్య జరిగే పోరాటం గానే దీనిలో యీ యువకులంతా పాల్గొంటున్నారు [illegible] భవిష్యత్ విద్యావిధానంలో మార్పుకొరకు, [illegible] సర్వతోముఖాభి వృద్ధికై జరిగేవిస్తృత పోరాటంగానే యువకులు పాల్గొంటున్నారు ఈ అంతిమపోరాటంలో [illegible] ఈగ్రామరిపబ్లిక్కు (కొడ వటిగల్లు గ్రామరిపబ్లిక్) భవిష్యత్ రాజ్యాంగా నికి ఆదర్శంగా ఎంచుతున్నారు. నిరంకుశ ఉద్యోగులకు స్వస్తిచెప్పి ఈ రిపబ్లిక్ ను స్థాపించి స్టేట్ పోరాటంలో నూతనఘట్టాన్ని నిర్మించిన గౌరవం యీ యువకులకే దక్కింది. హైదరా బాద్ స్టేటులోని యువకులందరికీ ఆదర్శ ప్రాయులైనారు

నవయుగచందా వివరాలు

సంవత్సరానికి	3- 0-0
అర్ధ సంవత్సరానికి	1- 8-0
3 మాసాలు	0 .12-0
విడిప్రతి	0 - 4-0

డిటెన్షన్ పద్ధతికి గోరీకట్టాలి!

ప్రజాతంత్ర విద్యావిధానంకొరకు విద్యార్థులు పోరాడాలి!

మల్లవరపు రామకృష్ణరావు

ఆంధ్రవిద్యార్థులు తిరిగి యీసంవత్సరం డిటెన్షన్ పోరాటానికి సంసిద్ధులవుతున్నారు. ప్రజాతంత్ర విద్యా విధానం కొరకు అకుంఠిత దీక్షతో విద్యార్థులు పోరాటాలు సాగిస్తూ వచ్చారు. కాని మద్రాసు మంత్రివర్గం నూతన విద్యావిధానంపట్ల అవలంబించిన సంకుచిత పద్ధతివలన విద్యార్థులు, ప్రజలు ఆశాభంగం చెందారు విద్యావిషయాలపై విద్యాశాఖామంత్రి వద్దకు నడిపిన రాయబార సభ్యులముందు, విద్యార్థులు పిరికి పందలని, వివేకహీనులనీ, బాధ్యతారహితులనీ నిందించేస్థితికిదిగజారారు,

డిటెన్షన్ పద్ధతికి మూలం


బ్రిటిష్ ప్రభుత్వం పాలన ప్రారంభించి నప్పటినుంచి తన ప్రభుత్వ నిర్వహణ యంత్రానికి ఉపయోగపడే యువకులను తయారు చేసేందుకు బానిసవిద్యా విధానం అమలు పర్చారు. దేశం పారిశ్రామికంగాను, వ్యాపసాయికంగాను, పురోభివృద్ధి పొందేందుకు ఉపయోగపడని విద్యను విద్యార్థి హృదయ కుహరంలో స్వతంత్ర భావ వికాసానికి తావులేనివిద్యను విద్యాలయాలలో ప్రవేశ పెట్టారు, జాతీయోద్యమ ప్రభావ ఫలితంగా యువకులలో విద్యాతృష్ణ ఏర్పడింది దీనిఫలితం విద్యార్థుల సంఖ్య పెరిగి నిరుద్యోగ సమస్య విషమ రూపం దాల్చింది ప్రజా అవుసరాలుగాని, ప్రజా అభ్యుదయంగాని, దృష్టిలో లేని పరాయి ప్రభుత్వం, నిరుద్యోగ సమస్యను కృత్రిమ రూపంలో పరిష్కరించ సమకట్టింది. దీని ఫలితం 1936 లో పరిశీలక కమిటీని నియమించింది. ఈకమిటీ నివేదిక విద్యార్థులను ఎక్కువ వడపోత విధానానికి గురిచేయాలని సూచించింది.

"కొండను త్రవ్వి ఎలుకనుబట్టి నట్లు" యీ పరిశీలక కమిటీ బానిసవిద్యా విధానాన్ని మథించి తేల్చిన సారాంశం, వడపోత విధానాన్ని హెచ్చుచేయటం. ఈ కృత్రిమ పరిష్కారమార్గంయొక్క వికృతరూపమేడిటెన్షన్ పద్ధతి.

విద్యావ్యాప్తిని అరికట్టే సాధనంగా మాత్రమేగాకుండా, విద్యాలయాలలోని నిరంకుశ అధికారుల ఆటలు కొనసాగించేందుకు, విద్యా సంస్థలలోని అసౌకర్యాలు, అసమర్థతలు కప్పిపుచ్చేందుకు ఒక ఆయుధంగా తయారైంది. అనేక విద్యాలయాలలో, సరిపడిన ఉపాధ్యాయులు లేకపోవటం, లేబరేటరీలు లేకపోవటం, టెక్స్టుపుస్తకాలు లేకపోవటంచేత విద్యార్థులలో విద్యాస్థాయి నానాటికి క్షీణించుతోంది. విద్యాస్థాయిక్షీణతను ప్రజలకు తెలియకుండా చేసి తమతమ స్కూళ్ళ సమర్థతను వెల్లడించుకోవాలని, యీడిటెన్షన్ పద్ధతిని తీవ్రంగా అమలుపర్చుతున్నారు. బందరు గుంటూరు కాలేజీ ప్రిన్సిపాళ్లు, ఈడిటెన్షన్ విధానాన్ని తమస్వార్థానికి వినియోగించుకొని, తమనిరంకుశ, అనాగరిక, అభివృద్ధినిరోధక పరిపాలనను అమలుపర్చి, చైతన్యవంతమైన ఆంధ్ర విద్యార్థి ఉద్యమంపై స్వారీచేసేందుకు యీ డిటెన్షన్ పద్ధతిని అమలుపర్చుతున్నారు. సంఘటితమవుతున్న విద్యార్థి ఉద్యమ కార్యకర్తలను యీడిటెన్షన్ పిశాచానికి బలిపెడుతున్నారు. ఈడిటెన్షన్ పద్ధతి ఏరూపంలోను, విద్యాభివృద్ధికి తోడ్పడుటకుగాక, ప్రతి బంధకంగా తయారవుతోంది.

డిటెన్షన్ల బూటకం

బానిస విద్యావిధాన భాగమైన ఈడిటెన్షన్ పద్ధతి ఏవిధంగా చూచినా సమర్థనీయం గాదు 7 మాసాలు చదివిన విద్యార్థిని పబ్లిక్ పరీక్షలకు రెండుమాసాలు ముందు 'అనర్హుడని' డిటెన్ చేయుటలో అర్థం ఏమిటి? వాస్తవంగా అనర్హుడు ఆ విద్యార్థియా? లేక ఆ ఉపాధ్యాయుడా? గత సం॥ చల్లపల్లిలో డిటెన్ చేసిన విద్యార్థిని, తిరిగి విద్యార్థుల పోరాట ఫలితంగా పబ్లిక్ పరీక్షకు పంపితే ప్యాసయ్యాడు. ఇటువంటి ఉదాహరణలు అనేకము ఇవ్వవచ్చు పబ్లిక్ పరీక్షకు హాజరవటం ద్వారా, అనేక టెక్నికల్ కోర్సులు చదివి తన భావి జీవితక్రమాన్ని నిర్ణయించుకోగల్గుతాడు గదా? ఇందుకు అధికారులకు కడుపుమంట ఎందుకు?



అభివృద్ధినిరోధక డిటెన్షన్ పద్ధతి ఆంధ్ర దేశంలోని ప్రతి పౌరునిచేత, ప్రతి రాజకీయ సంస్థచేత నిరసించబడింది. 1939—46 లలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం, యీ వినాశకర పద్ధతి రద్దుచేయాలని తీర్మానించింది. రాష్ట్ర కాంగ్రెసు 'అధ్యక్షుడు ఆచార్య రంగా నిరసించారు. ఆంధ్ర విద్యార్థిలోకం అనేక సంవత్సరముల నుంచి వీరోచిత పోరాటము సాగించుతున్నారు. గత సంవత్సరం ఆంధ్ర విద్యార్థులు' లాఠీ దెబ్బలకు 'నిర్బంధాలకు నిలబడి అప్రతిహత ధైర్య సాహసాలను ప్రదర్శించి విజయలక్ష్మిని చేపట్టారు. కాని చైతన్య వంతమైన బందరు వుద్యమాన్ని నిరంకుశ ప్రిన్సిపాల్. అభివృద్ధి నిరోధకుడు సి. ఆర్. రెడ్డిగారు కలిసినిచ్చిన్నం చేశారు. శ్రీ జి లింగారెడ్డిగారు నిరసనవ్రతం పూని ఆంధ్ర సిండికేటును కదిపారు.

16% డిటెన్ చేయండి అరెస్టులు చెయ్యండి!

గత అనుభవాన్ని విస్మరించి తిరిగి ఈ సంవత్సరం 16% మందిని డిటెన్ చేయమని డి పి ఐ సర్క్యులర్ జారీజేశాడు కాలేజీలలో ఈ వడపోత విధానం జోరుగా సాగించేందుకు ప్లానులు వేస్తున్నారు. 'గుంటూరు' పోరాటాన్ని అణచుటద్వారా లైన్‌క్లియర్ (line clear) చేయాలని కలలు కంటున్నారు. మాతృభాషను విశ్వవిద్యాలయంలో ప్రవేశపెట్టుటకు అంగీకరించని అభివృద్ధి నిరోధకుడు సి. ఆర్ రెడ్డిగారు ఇందుకు నాయకత్వం వహించుతున్నాడు. విద్యాశాఖామంత్రి ఈ విషయంలో "ఎక్కడ వేసిన కంబళి అక్కడే వున్నదన్నట్లు. డిటెన్షన్ విధానంపట్ల తమకున్న పురాతనపు అభిప్రాయాన్ని పట్టుకు వేలాడుతున్నారు. విద్యా సమస్యలపై వెళ్ళిన రాయబార సభ్యులను తూలనాడుతున్నారు. గత సంవత్సరం గన్నవరంనుంచి వెళ్ళిన తలితండ్రులను" మీరు మూర్ఖులు, అవివేకులు అని దూషించారు అదేరీతిగా ఈ సంవత్సరం కూడ చేస్తున్నారు ఇదిమంత్రివర్గానికి కళంకం. మదరాసు రాజధాని ప్రజలకు తీరని అపచారం. దీనికి తోడుగా విద్యార్థుల ఆందోళన అణిచేందుకు, పోలీసు బలగాన్ని తీసుకోమని విద్యాసంస్థలకు తాకీదు పంపారు ఇట్టి నిరంకుశ తాకీదు ప్రజామంత్రి వర్గంనుంచి వచ్చినదేనా? ప్రజాతంత్ర విద్యా విధానాన్ని అమలుపర్చేందుకు కృషిచేస్తున్న విద్యార్థి లోకంపైన ఇట్టి ప్రజాస్వామిక వ్యతిరేకపద్ధతి అవలంబించడం మంత్రివర్గానికి తగనిపని.

పోరాటం వినా గత్యంతరం లేదు,

దేశపునర్నిర్మాణ కార్యక్రమంలో ముఖ్యభాగమైన విద్యావిధానమునకు నూతన పథకాలు తయారు అవుతున్నాయి. జాతీయవిద్యా స్వరూపము, పరీక్షలు మొదలయిన విషయాలను గురించి ఆలోచనలు సాగుతున్నాయి. నూతన విద్యావిధానంలో ప్రతివిద్యార్థికి విద్యయెడల అభిరుచి యెక్కువయ్యేందుకు, విద్యార్థి శక్తి సామర్థ్యాలు అభివృద్ధి అయ్యే పరీక్షావిధానము కావాలి ప్రతియువకునకు వుద్యోగ గ్యారంటీ వుండాలి విద్యావ్యాప్తికి విద్యాసౌకర్యాలతో కూడిన విద్యాలయాలు కావాలి. వీటికి ప్రత్యామ్నాయంగా డిటెన్షన్ అమలుబర్చటం జాతీయ విద్యాప్రణాళికకు పూర్తివిరుద్ధము. నూతన జాతీయవిద్యావిధానం అమలు పర్చేందుకు తమ సర్వ శక్తులను కేంద్రీంరించుటకు తయారైన విద్యార్థుల సహకారమును తృణీకరించి, అభివృద్ధినిరోధకులు విద్యాసంస్థలపై పెత్తనంచేస్తున్నారు. విద్యార్థిలోకానికి పోరాటంద్వారాన్యాయమైన హక్కులు సంపాదించుకోటం వినా మరొక మార్గం కనిపించటము లేదు. విద్యార్థిలోకం ఐక్యమై డిటెన్షన్ వ్యతిరేకపోరాటాన్ని నడిపి విజయం సాధించాలి

(11వ పేజీ తరువాయి)

అమెరికా, యుగోస్లేవియా. చకొస్లొవేకియా, సోవియట్‌రష్యా, మున్నగు ప్రముఖ యువజనోద్యమాల తరపున ప్రేక్షకవర్గం మహాసభకు హాజరుకానున్నారు. ఒక్కమాటలో చెప్పాలి అంటే మహాసభ ఆగ్నేయ ఆసియా దేశాలకు మాత్రమే అధికారరీత్యా సంబంధించినా ప్రత్యేకాహ్వానములతో ప్రపంచయువజన సంస్థల ప్రతినిధులు ప్రథమ పర్యాయం మన దేశంలో సమావేశంకానున్నారు.

భారత యువజనసంస్థల కర్తవ్యం

ఈ మహాసభను జయప్రదం చేయవలసిన బాధ్యత ప్రపంచ యువజన సమాఖ్య భారతదేశంలోని యువజనసంస్థలపై బెట్టింది ఇప్పటికప్పుడే యువజన సమాఖ్య అనుబంధసంస్థయైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ మహాసభ ప్రయత్నాలు ప్రారంభించింది మహాసభ కలకత్తాలో ఫిబ్రవరిలోగాని లేక ఏప్రిల్ మొదటి వారంలోగానిజరపనిర్ణయించియువజనసమాఖ్య అనుమతినిగూడ పొందటమైంది మహాసభాకాలంలో భారత యువజన, విద్యార్థి ఉద్యమ చరిత్రలనువివరించు ప్రదర్శనాలు. వైజ్ఞానిక పోటీలు, భారత జాతీయ ఆటల ప్రదర్శనలు మున్నగునవి మహాసభతోపాటు జరుపుటకు నిర్ణయించటం జరిగింది, ఆగ్నేయ ఆసియా యువజన మహాసభను జయప్రదం జేయుటకు తోడ్పడమని భారతదేశంలోని ప్రతి యువజన విద్యార్థిసంస్థను విద్యార్థి ఫెడరేషన్ సహాయం అర్థిస్తోంది

ఆంధ్రయువకుల కర్తవ్యం

ఆంధ్ర యువజన ఫెడరేషన్ ఆగ్నేయ ఆసియా యువజన మహాసభను జయప్రదం జేయుటకు తన శక్తికొలది కృషి సల్పుతానని వాగ్దానం జేసింది, గుంటూరులో నవంబరు 21, 22 తేదీలలో జరిగిన రాష్ట్ర యువజన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశములో యీ విషయము చర్చించి నిర్ణయాలు తీసుకొనబడినవి. యీ యువజన మహాసభ నాటికి ఆంధ్రయువకుల కార్యకలాపాలను వివరించు చిత్రప్రదర్శనమును, రిపోర్టును తయారుజేయాలని అంగీకరించడమైంది ఆంధ్రవిజ్ఞానాన్ని ఆశియాదేశ యువజన సోదరులముందు ప్రదర్శించుటకు ప్రత్యేక దళమును, బాల సంఘదళముతో సహా తర్ఫీదిచ్చుటకు నిర్ణయించడమైంది వీటితోపాటు ఆంధ్రుల జాతీయక్రీడలైన చెడుగుడు, ఉప్పుపట్టి, కొక్కో, ఆటల ప్రదర్శనం గూడ జరుపుటకు ప్రయత్నములు సాగించుటకు అంగీకరించడమైంది ఈ కార్యకలాపాలను ఆంధ్ర యువజన ఫెడరేషన్ నిర్వర్తించుటకు కనీసం మూడువేల రూపాయలు అత్యవసరం ఆంధ్ర విజ్ఞానాన్ని దేశదేశాల చాటుటకు ఆంధ్ర యువకులు, ప్రజలు తమ శక్తికొలది తోడ్పడి యీ మొత్తాన్ని పూర్తి జేస్తారని విశ్వసిస్తాం

విజ్ఞప్తి

భారతదేశంలో మొదటి సారిగా ప్రపంచ యువజన ప్రతినిధులు ఆగ్నేయ ఆసియా దేశ యువజన మహాసభ సందర్భంలో సమావేశమవుతున్నారు ప్రపంచ యువజన ఉద్యమాన్ని గూర్చి సవిస్తరంగా తెలుసుకొనుట కిది మహదవకాశం, ఆంధ్రయువజన ఉద్యమాన్ని గూర్చి ప్రపంచానికి తెలియ జెప్పుటకు గూడ యింతకు మించిన అవకాశం మనకురాదు. కనుక ప్రతి యువజన ఉద్యమ కార్యకర్త, ఉద్యమ అభిమాని మహాసభను జయప్రదం జేయుటకు తోడ్పడమని, ఆంధ్ర యువజన ఫెడరేషన్ మహాసభలో నెరవేర్చ దలచిన కార్యక్రమమును జయప్రదం జేయమని అందుకు విరాళాలు వసూలుజేసి పంపమని విజ్ఞప్తి జేయుచున్నాము.

యస్. వి. వరసయ్య,
అధ్యక్షుడు.
ఆంధ్రరాష్ట్ర యువజనఫెడరేషన్.


గుంటూరు విద్యార్థుల పోరాటం

ప్రజాస్వామిక విద్యావిధాన కొరకు జరి

గుంటూరు ఆంధ్ర విద్యార్థి ఉద్యమానికి పుట్టినిల్లు పది సంవత్సరములనాడు గుంటూరులో జయల్వెడలిన విద్యార్థి చైతన్యవెల్లువే రాష్ట్రమంతటా వ్యాపించి నేటి బలమైన ఆంధ్ర విద్యార్థి ఉద్యమానికి పునాదులు నిర్మించింది. నేడు ఆంధ్ర విద్యార్థుల జీవన్మరణ పోరాటము జరుపుచున్న ఏ. సీ. కాలేజీ విద్యార్థి సోదరులే 10 సంవత్సరములనాడు డాయ్స్ట్రాక్ అనే అమెరికను దొర నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించి, ఆంధ్రదేశానికి మార్గదర్శకులయ్యారు. వీరి యీ ఆదర్శమే ఆంధ్ర విద్యార్థులను నిరంకుశత్వానికి, నిర్బంధానికి వ్యతిరేకంగా సమీకరించుటకు చైతన్యవంతులను జేసింది. ఇంతేగాదు రెండవ యుద్ధానంతరం జరిగిన ఆంధ్ర విద్యార్థి పోరాటములలోగూడ గుంటూరు విద్యార్థులు ఆంధ్రవిద్యార్థి ఉద్యమానికి తాము వహించిన నాయకత్వాన్ని నిల్పుకొన్నారు. నిరుడు సంవత్సరం నిర్బంధవిధానాన్ని, డిటెన్షన్‌లకు వ్యతిరేకంగా ఆంధ్రవిద్యార్థులు జరిపిన పోరాటాలకు ప్రప్రథమంగా తమ అక్టోబరు 13వ తేదీ సమ్మెతో ఏ సీ. కాలేజీ విద్యార్థులే నాయకత్వం వహించారు. ఆంధ్రదేశం విద్యార్థి ఉద్యమం 1942 తర్వాత చీలికలై పోయి విద్యార్థులలో నిరాశ,నిస్పృహ వ్యాపించియుండగా ప్రథమసారిగా ఒక ప్రధాన పోరాటంలో వివిధపక్ష విద్యార్థుల ఐక్యతను సాధించి - ఐక్యవిద్యార్థి పోరాటాన్ని సాగించుటకు ముందుకు వచ్చినదిగూడ గుంటూరు ఏ సీ కాలేజీ విద్యార్థులే। ఇట్టి పోరాట సాంప్రదాయాలు గల్గిన, ఆంధ్రవిద్యార్థి ఉద్యమానికి తలమానికముగానున్న గుంటూరు విద్యార్థులే యీసంవత్సరం విద్యార్థిఉద్యమంపై నిరంకుశ విద్యాలయాధికారులు, విద్యాశాఖాధికారులు ప్రారంభించిన దండయాత్రను ఎదుర్కొనుటకు ప్రప్రథమంగా ముందుకొచ్చారు. ఈ చైతన్య ఫలితమే నేడు ఏ. సీ కాలేజీలో జరుగుచున్న చరిత్రప్రసిద్ధమైన సమ్మె.

గుంటూరు ఏ సీ. కాలేజీలో గత మూడు మాసములలోను విద్యార్థులు మూడుసమ్మెలు జేయవలసివచ్చింది. విద్యాలయంలో విద్యార్థులు సమ్మె కొనసాగిస్తున్నారని షుమారు 25 రోజులు కాలేజి మూసివేయడం జరిగింది. నేడు విద్యాలయాలలో యిట్టిపరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయి ?

ఆంధ్రవిద్యార్థి వుద్యమము సామ్రాజ్యవాదుల స్వప్రయోజనముకొరకు యేర్పరుపబడిన నేటి బానిస విద్యావిధానము పోవాలని, దానిస్థానే ప్రజాతంత్ర జాతీయ విద్యావిధానము కావాలని గత పదిసంవత్సరాలుగా పోరాటాలు జరుపుతూ వచ్చి విద్యాలయాలు విద్యార్థి మానసిక వికాసాన్ని యినుపచట్రంలోపెట్టి నిర్మూలించేవిగాకుండా విద్యార్థులను స్వతంత్రభావాలతో ప్రజాతంత్ర పౌరులుగా, దేశసేవా దక్షులుగా తయారుచేయాలని విద్యార్థిఉద్యమం కృషి చేస్తూవచ్చింది. ఆగస్టు 15 తో మనము సాధించిన రాజకీయ స్వాతంత్ర్యము యిట్టి ప్రజాతంత్ర జాతీయ విద్యావిధాన స్థాపనను సుగమం చేస్తుందని, విద్యాలయాలపై నిరంకుశ విద్యాలయాధికారులకు, ప్రజా పీడకులైన



ఏ సి. కాలేజీ గేటులో పికెటు చేస్తున్న విద్యార్థులు

జమీందారులు, పెట్టుబడిదారులకున్న ఆధిక్యతకు స్వస్తి చెప్పబడుతుందని ఆశించారు. కాని ఆచరణలో తద్వ్యతిరేకంగా జరగటం ప్రారంభించింది

ఏ సీ. కాలేజీలో విద్యార్థులను బెదరించి, భయపెట్టి తనపెత్తనాన్ని సాగించుకొనటం అమెరికన్ ప్రిన్సిపాలైన సైప్పుదొరకు అలవాటు. ఏ కారణం లేకపోయినా విద్యార్థులలోని స్వతంత్రభావాలను నిర్మూలించుటకు ప్రతి టరము ఒకరిద్దరు విద్యార్థులను బయటకు పంపటం డాక్టరు సైప్పుకువున్న అలవాటు. ఈధోరణితోనే ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవము జరిగి నిండా పదిహేనురోజులు కాకపూర్వమే బి. ఏ రెండవ సంవత్సరపు విద్యార్థులను నలుగుర్ని అకారణంగా కాలేజీ నుండి వెళ్ళగొట్టాడు. పరదాస్యం నుంచి విముక్తిపొందామని, సంబరపడుతూ సౌఖ్యప్రదమైన భవిష్యత్తును యికముందైనా పొందగలమని కలలుగంటున్న ఏ సీ కాలేజీ విద్యార్థులు యీ నిరంకుశత్వాన్ని సహించలేకపోయారు ఐక్యతతో సమ్మెచేసి గుంటూరు పౌరుల సహాయాన్నిపొంది తిరిగి తమ తోటి సోదరులను కళాశాలలో చేర్పించుకొనగలిగారు ఇది ప్రథమసమ్మె వెనుకన్ను చరిత్ర. ఈఘటన తదనంతరమైనా ప్రిన్సిపాలు విద్యార్థుల భావాలను గమనించి తమ పాతనిరంకుశపద్ధతులకు స్వస్తి చెప్పి విద్యాలయాన్ని శాంతంగా నడుపుటకు కృషిచేయవలసింది. కాని సంవత్సరాల తరబడి నిరంకుశపద్ధతులతో విద్యాలయాన్ని నడపుటలో ఆరితేరిన డాక్టరు సైప్పు యెలా మారగలడు ?

హయ్యరు హాలు విద్యార్థులు (కాలేజీ హాష్టలు) తమహాష్టలులో జరుగుతున్న దొంగతనాలను అరికట్టమని ఫిర్యాదు చేసుకొనగా వారిని అనరాని మాట లన్నాడు. విద్యార్థి హక్కులకై కాలేజీలో వచ్చే ప్రతిపోరాటాన్ని క్రిష్టియన్ విద్యాలయమును నాశనంచేయుటకు హిందూవిద్యార్థులు పన్నుతున్న కుట్రలని క్రిష్టియన్ హిందూవైషమ్యాలు విద్యార్థులలో కలుగచేయాలని చూస్తూ, క్రిష్టియన్ విద్యార్థుల "సంరక్షకుడ" నని పోజువేసే యీ డాక్టరు సైప్పు ఒకటిన్నర రోజులు తిండిగూడ పెట్టకుండా హయ్యరుహాలు క్రిష్టియన్‌విద్యార్థులను మాడ్చాడు. హాష్టలునుండి గూడ విద్యార్థులనందరిని వెళ్ళగొట్టాడు ప్రిన్స్‌పాల్‌యొక్క యీ పశుప్రవర్తనే రెండవసమ్మెకు కారణము,

ఈ రెండుసమ్మెలలోను విద్యార్థి కార్యాచరణ కార్యదర్శిగా యీ పోరాటాలకు నాయకత్వము వహించి నడిపిన శ్రీ దాసరి నాగభూషణరావును కళాశాలనుంచి యెట్టికారణము లేకనే బయటకు పంపాడు ఈ ప్రిన్స్‌పాల్ నిర్బంధవిధానం యింతతోనైనా ఆగక మరి 40 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు యిచ్చివేస్తున్నాను తీసికెళ్ళమని సంరక్షకులకు రి

యస్. వి. నరసయ్యా


ఆంధ్ర ప్రజల పోరాటం

విద్యార్థి పోరాటాలను ప్రజలు బలపర్చాలి

షరు నోటీసులు యిచ్చాడు ఈనిరంకుశచర్యల పరికట్టితమవిద్యార్థి జీవితాన్ని నిలబెట్టుకొనుటకు సమ్మె తప్ప వేరుగత్యంతరము లేదని ఎ. సీ. కాలేజి విద్యార్థులు మూడవ సమ్మెకు పూనుకున్నారు ఈ పోరాటాన్ని నాశనం చేయుటకు ప్రిన్సిపాల్ పడరాని పాట్లన్నీ పడ్డాడు. కళాశాలను బాధ్యతారహితంగా 25 రోజులు మూసివేసి 1300 మంది విద్యార్థుల విద్యకు దెబ్బగొట్టాడు ఐనా విద్యార్థులు ఐక్యతతో ప్రిన్సిపాల్ దిగివచ్చి తమ కోర్కెలు అంగీకరించువరకు సమ్మె సాగించాలని ధృఢనిశ్చయులై యున్నారు.

ఈ సంవత్సరపు ఏ. సి. కాలేజి విద్యార్థుల పోరాటాలు ఆంధ్రవిద్యాలయాలన్నిట్లో బయలుదేరనున్న డిటెన్షన్ వ్యతిరేక, నిర్బంధ వ్యతిరేక పోరాటాలకు నాంది మాత్రమేనని గుర్తించినవిశ్వవిద్యాలయాధికారులుకూడా గుంటూరు విద్యార్థిపోరాటాలకు విచ్ఛిన్న మార్గాలు వెతుక ప్రారంభించారు రాష్ట్ర విద్యార్థి వుద్యమానికి నాయకత్వము వహించే గుంటూరు వుద్యమాన్ని దెబ్బకొట్టితే రానున్న రాష్ట్ర పోరాటాలను నీరుకార్చగలం అనేధీమాతో తమ పూర్తి నిర్బంధ విధానాన్ని గుంటూరుపైనే విశ్వ విద్యాలయం కూడ కేంద్రీకరించింది. విద్యాపునర్నిర్మాణానికి కంకణం కట్టుకొన్నామని ప్రకటనలుచేసే రాష్ట్ర మంత్రివర్గము కూడ యీ నిరంకుశ విద్యాలయాధికారుల పంధాను బలపర్చ ప్రారంభించింది. ఈవిద్యార్థి వ్యతిరేక పంధాయొక్క ఫలితాలేమిటి?

ప్రభుత్వఅండను చూచుకొని డాక్టరు సైప్ను రోజురోజుకు బిఱ్ఱబిగవ సాగాడు. ప్రభుత్వము విద్యార్థి పోరాటాలను నిర్దాక్షిణ్యముగా పోలీసు బలంతో అణచివేస్తామని ప్రకటనలు చేసింది. విశ్వవిద్యాలయాన్ని తమ జేబుసంస్థగా అట్టిపెట్టుకొంటూ ప్రజాస్వామికపద్ధతులంటే యేవగించుకొను సి. ఆర్. రెడ్డికి కావలసిందేమిటి? విద్యార్థుల న్యాయమైన కోర్కెలకు తప్పుడు నిర్వచన మివ్వటానికి బందరు ప్రిన్సిపాలును కొట్టాడనే ఒక దొంగనేరమారోపించి, జమీందార్లు బందరు ప్రిన్సుపాల్‌లాంటి అభివృద్ధి నిరోధకుల ప్రాబల్యంకలిగిన సిండికేటు, నాగభూషణరావును డిబారుచేస్తూ తీర్మానించింది. తద్వారా విద్యార్థి వుద్యమమంటే రౌడీ చర్యలకు పూనుకొనే వుద్యమమని ప్రచారము లేవదీసి ప్రజల, వుపాధ్యాయుల, పెద్దల సానుభూతిని యీ విద్యార్థి పోరాటాలు పొందకుండా చూడాలని ప్రజా సానుభూతినుండి దూరమయియున్న, అప్పుడు విద్యార్థి వుద్యమంపై గట్టిదెబ్బతీసి నాశనం చేయాలని యీ విధమైన కుట్రలు పన్నుతు మద్రాసు మంత్రివర్గముకూడ విద్యార్థుల కోర్కెలలోని న్యాయమును గుర్తించుటకు బదులు యీ నిరంకుశ విద్యాలయాధికారులకు తలొగ్గి విద్యార్థివుద్యమంపై తన దాడిని కేంద్రీకరించింది. దీనిపర్యవసాన మేమిటి?



కాలేజీ ఆవరణలో విద్యార్థుల సభ. మేడూరి నాగేశ్వరరావు ఎమ్ ఎల్ ఏ గారు మాట్లాడుతున్నారు.

నవంబరు 28 వ తేదీన కళాశాలను తెరచినపుడు షుమారు 300 మంది పోలీసులు యీ గుంటూరు విద్యార్థుల పోరాటమును విచ్ఛిన్నముచేయ వినియోగింపబడ్డారు. శాంతంగా పికిటింగుచేసే విద్యార్థులను ఎందరినో మందికిమించి అరెస్టుచేశారు. పికెటర్లను పోలీసులు బూటుకాళ్ళతో తన్నారు. తుపాకీ మడమలతో కొట్టి హింసించారు. వినరాని బూతులను కూశారు. ఇక లాఠీచార్జీలకు లెక్కేలేదు ఒక విద్యార్థులనేకాక పట్టణ ప్రజలపై కూడ అనేక అత్యాచారాలు యీ పోలీసులు జరిపారు, కాలేజి బజారు సంతటినీ పోలీసులు ఆక్రమించుకొని వచ్చేపొయ్యే ప్రతివిద్యార్థిని హింసించుతూ వచ్చారు. కాలేజీ ఆవరణంలోనే పోలీసులు ఆక్రమించి, ఒక విద్యాలయంగాకాక పోలీసు క్యాంపులా మార్చారు. ప్రతిదినం టియరుగ్యాసు బాంబులతోను, అంబ్యులెన్సు కారులతోను పోలీసుపార్టీ కళాశాలముందు ప్రత్యక్షమయ్యేది. ప్రతినిమిషం కాలుస్తామని బెదరింపులు ప్రతి పక్కా ధ్వనిస్తుండేవి. ఇట్టి నిర్బంధవిధానం ఆంధ్రవిద్యార్థి వుద్యమంలో అపూర్వము. పోలీసులకసాయుధచర్యలు 1942 లో గుంటూరులో జరిగిన ఘటనలను మరిపించాయి. ఈపోలీసు అత్యాచారాలకు 5 గురు విద్యార్థుల తలలు పగిలాయి. తుపాకి మొల్లతోను, లాఠీపోట్లతోను, 4 రు విద్యార్థులు రక్తం కక్క ప్రారంభించారు. యితలాఠీ దెబ్బలకు గురిఅయిన వారిసంఖ్య కంతే లేదు.

ఈ అత్యాచారాలు జరుపుటకు ఇచటి పోలీసులు చాలరన్నట్లు విశాఖజిలా నుంచి, మలబారునుంచివచ్చిన స్పెషల్ పోలీసులను ప్రయోగించారు. డిప్యూటీజనరల్ ఆఫ్‌పోలీసు నుంచి, స్థానిక పోలీసు అధికారి వరకు జిల్లా కలెక్టరునుండి రివిన్యూ ఆఫీసరు వరకు స్వయముగా దగ్గరవుండి యీ పశుకృత్యాలు చేయించారు. నైజాం పోలీసు కిరాతకచర్యలనుండి సరిహద్దు ప్రాంతాలలోని ఆంధ్రప్రజలను రక్షించుటకని తెచ్చిన యీమలబార్ - విశాఖ స్పెషల్ పోలీసులను ఆంధ్ర ప్రజల రక్షణకు కాక, ఆంధ్ర ప్రజాఉద్యమములో ఒక భాగమైన విద్యార్థి వుద్యమ భక్షణకు వుపయోగించారు.

ఇంతటి నిర్బంధవిధానాన్ని గుంటూరువిద్యార్థులు ఐక్యంతోవీరోచితంగా ఎదిర్చిపోరాడారు. ఆంధ్రదేశానికి మార్గదర్శకు లయ్యారు. ప్రతిదినం వందలు, వేలతో హాజరవుతున్న బహిరంగసభలను జరుపుతునే వచ్చారు 144 సెక్షను వున్నా, లాఠీమోతలు నెత్తిపై మోగుతున్నా, జైళ్ళలోని తమతోటి సోదరులను విడుదలచేయమని, విద్యార్థి హక్కులను అంగీకరించమని, వందలాదిగా విద్యార్థులు ప్రదర్శనలు చేస్తూనేవచ్చారు. పట్టణ పౌరులు సర్వవిధాల విద్యార్థులకు తోడ్పడుతూనే వచ్చారు.

ఇంతటి నిర్బంధ విధానం విద్యార్థి పోరాటాన్ని ఎందుకు విచ్ఛిన్నం పర్చ లేకపోయింది? నేటి బానిస విద్యావిధానం అమలులో వున్నంతవరకు తమ విద్యావిజ్ఞానాభివృద్ధి లేదని, విద్యాలయాల్లో తమకు విద్యనుపొందే హక్కు లేదని, ప్రతి ఆంధ్రవిద్యార్థి నేడు గుర్తించాడు. అందుచే యెంతటి త్యాగాలనైనా చేసి నేటి బానిస విద్యావిధానాన్ని పాతిపెట్టుటకు ప్రతి

(మిగతా 23 వ పేజీలో)

బాలప్రపంచం

బాల దీక్ష ★

(బాలసంఘ నాటిక)

యల్. కోటేశ్వరరావు ⸙ వి. వి. శేషాచార్యులు



నటకులు:

రామారావు	వయస్సు	40
కమల	,,	30
బాల	,,	10
సుబ్బయ్యా	,,	15
డాక్టరు	,,	35

●

1 వ రంగం

(రామారావుగారి ఇల్లు - వరండాలో బాల తిరుగుతూ పాట పాడుతూ వుంటుంది)

పాట:

బాల. పెందలకడనే లేస్తాను
పండ్లు తోముకుంటాను
చద్ది అన్నము తింటాను
చక్కగ బడికి పోతాను

(సుబ్బయ్య పల్లెక - పొలెక బైటోటి వస్తుంటాడు)

బాల: సుబ్బయ్యా! సుబ్బయా!

సుబ్బ: (తిరిగిచూచి) ఏంటమ్మా?

బాల. ఏమీలేదు. నీకిప్పుడేమన్నా పెద్ద పనివున్నదా?

సుబ్బ: వుండకేం, తెల్లవారి నిద్రలేచిన దగ్గరనుండి సందకాడ పండుకో బోయిందాక తీరికేముందమ్మా.

బాల: అంతతీరికలేని పని ఏంచేస్తున్నా సుబ్బయ్యా?

సుబ్బ. ఏముంది. పొయ్యి కసువుదగ్గరి నుండి పేడకళ్ళవరకు ఏదోపని వుంటూనే వుంటుంది గదమ్మా.

బాల: కొంచెం సేపైనా తీరికలేకుండా ఎట్లా చేస్తున్నా సుబ్బయ్యా!

సుబ్బ: కాసేపు కూసుంటే మీనాన్న వూరుకుంటాడూ?

బాల ఊరుకోక ఏం చేస్తాడు? కొడతాడా?

సుబ్బ: కొట్టకపోయినా తిడతాడుగా, అందుకని ఏదోపని చేస్తుండాలమ్మా.

బాల: బడికిపోకుండా ఈపనేంటి? ఇంటి దగ్గర మీపెద్దోళ్లు లేరూ చెయ్యటానికి?

సుబ్బ: ఆళ్లుంటే నాకెందుకీ చాకిరి? ఒకముసలోడున్నాడు; అంతే.

బాల: ముసలోడేనా? ఇంకెవ్వరూ లేరూ?

సుబ్బ: ఊహు.

బాల: సరేనీకోసంగతిచెప్తావింటావా?

సుబ్బ: చెప్పమ్మా, ఇనకేం.

బాల: మరినీవూ .....

కమల. (లోపలినుండి) బాలా! బాలా!

బాల: ఓయ్.

కమల (బైటికివచ్చి) ఏంచేస్తున్నావే. బడిగంట కూడా వినిపించలేదా?

బాల: అప్పుడే గంటకొట్టారా అమ్మా?

కమల కొట్టకుండా నీకోసరంకూర్చుంటారు. పిల్లలంతా పరిగెత్తుతుంటే.

బాల: తలగూడా దువ్వుకోలేదుగదే, సరే సుబ్బయ్యా, బడికిపొయ్యి మళ్లీ వచ్చిచెప్తా. ఏం? (లోపలికిపోగా)

కమల: ఏంటిరా సుబ్బయ్యా, అమ్మాయి చెప్పటం? ఈ చెత్తంతా ఏమిటి? సరిగా చిమ్ము.

సుబ్బ ఏందో చెప్పబోయింది. అంతలోనే మీరు కేకేశారండి.

బాల. (పరుగెత్తుకొచ్చి) అమ్మా, అమ్మా, నిన్నడిగింది ఇయ్యవూ?

కమల నాన్న కూరగాయలకు గూడా డబ్బు లిచ్చి పోలేదు. బడినుండి వచ్చాక తీసుకొని కొనుక్కుందువు గాని పో.

బాల: ఒక అణా అన్నా చూడవే అమ్మా. ఆ, ఆ, (అంటూ అమ్మను వాటేసు కుంటుంది)

కమల: లేదే, పాడుపిల్లవు. పట్టినపట్టు వదలవు (బొడ్లో తడివి) ఇదుగో ఈ అర్ధణా తీసుకపో ముందు.

బాల: (చంక లెగరేస్తూ పోతుంది)

కమల: సుబ్బయ్యా, ఆకాస్త చిమ్మి ఆదొడ్లో కసువెత్తి వెయ్యరా, ఆ.

సుబ్బ: అట్లాగేనమ్మా. [తెర]

2 వ రంగం.

(సుబ్బయ్యకు కమల దోసిట్లో అన్నం పోస్తుంటుంది ఒకప్రక్కనుండి బాలపాటపాడుతూ)

పాట

బాలికలుబాలురంతా ఏకమవ్వాలి.
ఏకమై బాలసంఘం నిల్పుకోవాలి.

సుబ్బ: కమలమ్మగారూ! అమ్మాయి వస్తున్నట్లుందే?

క. బాల సంఘానికి పోయి వస్తున్నది పిచ్చి కుంక.

బాల. అమ్మా, అమ్మా నాకూదోసిట్లో పెట్టవే. (అంటూ అమ్మముందు

సుబ్బయ్యను తాకబోవు నట్లు కూర్చుంటుంది.)

క (ఇవతలకులాగి ఛీ! పాడుముండా ఇంట్లో పళ్లెంలో పెడతా. పా.

బాల. ఆఁ, ఆఁ, ఆఁ, నాకు దోసిట్లో పెట్టమ్మా (సుబ్బయ్య ప్రక్కగా కూర్చోబోగా)

క: ఓసి, మాలపిశాచి. ఇటుబడవే. (లాగి ఇవతలకూర్చోబెట్టి దోసిట్లో అన్నం పోసి - తిన్నతర్వాత చేతులకు నీళ్లుపోసి) రావే ఇంట్లోకి. సుబ్బయ్యా, నీవు పోయి గొడ్లకు మేతవెయ్యి. (పోవును)

బాల: (బొడ్లోనుండితీసి) సుబ్బయ్యా, ఇదిగో అప్పచ్చి (అంటూ చేతికియ్యబోతుంది)

సుబ్బ: అక్కడబెట్టమ్మా తీసుకుంటాను.

బాల: అక్కడ పెట్టటం దేనికి, తీసుకో సుబ్బయ్యా (అంటూ దగ్గరకుపోగా)

సుబ్బ. తాకబాక, తాకబాక.

బాల. ఏంతాకితే?

సుబ్బ మాలోణ్ణి గదంటమ్మా!

బాల: అయితేపం? మా బాల సంఘంలో - బళ్లో అందరం కలిసి వుంటంలా.

సుబ్బ: అక్కడ వేరు. ఇక్కడ వేరమ్మా! (అంటూ మేత కట్ట కట్టబోతాడు)

బాల: (సుబ్బయ్యను తట్టి) అదిగాదు సుబ్బయ్యా, నీకో మంచిమాట చెప్పనా?

సుబ్బ (ఉలికిపడి) అమ్మచూస్తే కోప్పడుతుంది. దూరంగా వుండి చెప్పమ్మా.

బాల: మా బాలసంఘంలో చదువు రానివారికి చదువు చెప్పాలీ అన్నారు.

సుబ్బ: ఊ ... (అంటూ చెత్త పోగు చేస్తుంటాడు)

బాల: ఊఁ. కాదు చదువుకుంటావా చెప్తానుకాని.

సుబ్బ: నా కెందుకమ్మా చదువు.

బాల: నా కెందుకంటావేం? చదువు రానివారు చవటలట. బాలసంఘంలో చెప్పారు సుబ్బయ్యా.

కమల: (లోపలనుండి) సుబ్బయ్యా- సుబ్బయ్యా!

సుబ్బ వస్తున్నానమ్మా (అనిపోబోగా

కమల: (వచ్చి) ఏం చేస్తున్నా?

బాల: చూడవే అమ్మా సుబ్బయ్యకు చదువుచెప్తానంటే తీరదంటున్నాడే.

కమల: ఎందుకురా సుబ్బయ్యా మధ్యాహ్నంపూట పని వుండదుగా. అప్పుడు చదువు చెప్పించుకోరాదూ?

సుబ్బ: అలాగే నమ్మా.

కమల: ఎండెక్కుతుంది. త్వరగా గొడ్లకు మేతేసి - దోడ్లో కుడితి పట్టుకెళ్లి సావిడికాడ వాటికి పెట్టి రా, పో.

బాల: తొందరగా రా సుబ్బయ్యా.

సుబ్బ: (తలవూవుతూ పోతాడు)

కమల: వస్తాడులేరా, నాన్నవచ్చేవేళయింది. చదువుకుందువుగాని పద. (అని పోతారు)

బాల (లోపలినుండి పలకా పుస్తకాలు, చాప తెచ్చుకొని చదువుతూ వుంటుంది. ఇంతలో సుబ్బయ్య వస్తుంటాడు.)

బాల: సుబ్బయ్యా! రా. ఇలాకూర్చో (చాపచూపుతుంది).

సుబ్బ: (కిందకూర్చుంటూ) ఆఁ, కూర్చుంటున్నా.

బాల: క్రిందగాదు. చాపమీదకు రా సుబ్బయ్యా.

సుబ్బ ఇక్కడ కూర్చుంటా లేమ్మా.

బాల. సరే. ఇదుగో పలక. బలపం ఇదుగో. ఓనమాలు రాసివ్వనా?

సుబ్బ ఊ. (తలవూపును)

బాల నే చెప్పినట్లు పలుకుతూ దిద్దాలి. ఒ. న. మః—అంతవరకు దిద్దిచెప్తా తర్వాత మళ్ళీ రాసిపెడతా.

సుబ్బ: దిద్దుతూ ఒ. న. మ. (అంటుంటాడు)

బాల: "మ" గాదు సుబ్బయ్యా. మః అనాలి.

సుబ్బ. ఒ. న. మః (అంటుంటాడు.)

బాల: అట్లా దిద్దగూడదు సుబ్బయ్యా (ఇట్లా దిద్దాలి అని తాకి దిద్దించబోగా రామారావు ప్రవేశించి చూచి)

రామా అయ్యయ్యో. ఈ అఘోరిం పేమిటి? వాడి ప్రక్కన కూర్చోవట మేంటి? వాణ్ణి తాకట మేంటి? ఏంటిరా సుబ్బా? అది.

సుబ్బ: (భయంతో) ఏమీ లేదండి.

రామా: ఏమీలేక పోవంట ఏంటిరా: (పలక చూచి) నీవాక చదువరివి. అదొక మాస్టరూనా? నీకైనా ఎక్కడ లేదురా జ్ఞానం.

బాల: చదువు నేర్పుకుంటున్నాడు నాన్నా! ఏం?

రామా. ఛీ, పాడుపిల్లా. భయంభక్తి లేకుండా అఘోరిస్తున్నావ్.

బాల: లేదు నాన్నా. చదువుకుంటున్నాం. అమ్మగూడా ఇద్దర్నీ చదువుకో మన్నదిగా.

రామా: ఊఁ. అమ్మ అఘోరించింది. నీవు ఉద్ధరిస్తావ్, పో. ఇది మొదలు చేసుకొని వాణ్ని తాకినట్లు వాడితో మాట్లాడినట్లు- చూస్తే (అని గుడ్లురుముతూ) సుబ్బా గొడ్లకు కుడితి పెట్టావంటరా?

సుబ్బ. పెట్టాను దొరా.

రామా: దొడ్లో కంపంతా ఆ మండె దగ్గరకు చేర్చమన్నా చేర్చావా?

సుబ్బ: ఇంకా కొద్దిగా వుంది దొరా.

(మిగతా 23 పేజీలో)



విజ్ఞాన విజయాలు

నేలలేకనే పైర్లు పెంచుట

"రాము"

ప్రపంచములో అతి పురాతన కళలలో వ్యవసాయము ముఖ్యమయినది.

సస్యములు బాగా పెరుగుటకు సారవంతమయిన నేల, దండిగా నీరు అవసరము. నేలలో మొక్కలు పెరుగునట్లు చేయునవేవని శాస్త్రజ్ఞులచే పరిశోధన చేయబడినది. కారణం. కొంతకాలమయిన వెంటనే నేల నిస్సారమగుటే నిస్సారమయిన నేలను మరల ఫలించునట్లు చేయుటకు సేద్యగాడు, విజ్ఞానం లేకున్నను సహజ బుద్ధితోనే ఆకు పెంట, పేడ, బూడిద, సున్నము మొదలయిన పచ్చి యెరువుల వేసి పంటలు పండించుచున్నాడు. అదీగాక ఒక భూమిలో ఎల్లప్పుడు ఒకే పంట పండించకుండా పంటలు మార్చి మార్చి పండించుచున్నాడు. వేరుసెనగ, జనుము మొదలయిన చిక్కుడు సంబంధమయిన పంటలు నేలను సారవంతం చేయగలవనే విషయముగూడా రైతుకు తెలియక పోలేదు.

శాస్త్రజ్ఞులు నేలను పరీక్షించినపుడు, మొక్కలు పెరుగుటకు నత్రజని, ప్రాణవాయువు, గంధకము, ఖటిక, భాస్వరము, మగ్నము, ఇనుము, పొటాసియము అను మూల ధాతువులు (Elements) అవసరమనియు, అవి నేలలో నత్రితములుగా, గంధకితములుగా, స్ఫురితములుగా నుండుననియు తెలిసికొనిరి మొక్కలు వాటికిగావలసిన కర్బనమును గాలినుండి, ఉదజనిని నీటినుండి గ్రహించగలవు. దీనివలన నేలలో సారమున్నదియనగా దానిలో కావలసిన లవణములు, కావలసిన నిష్పత్తిలో నున్నవనియే అర్థమనియు, పచ్చి యెరువులు వేసినపుడు మొక్కలకు గావలసిన సున్నము, లవణములు, సప్లయి చేయబడుననియు విశదమయినది. పచ్చి ఎరువులకు తోడుగా రసాయన ద్రవ్యములు - అమ్మోనియా గంధకితము, సూపర్ ఫాస్ఫేటు, పొటాసియ, సోడియ నత్రితములు మొదలగునవి వేసినపుడు. పంట ఎన్నోరెట్లు అభివృద్ధి కాగలదని తేలినది. చదువుకొన్న మనకు, పల్లెటూళ్లలోకూడ రైతు ఈయెరువులపేర్లు పలుకుతుంటే మనకు విచిత్రముగా నుండగలదు. అయితే రైతుకు ఆతని నేలకు ఏ లవణము అవసరమో తెలియవలెను.

వ్యవసాయ శాస్త్రమభ్యసించు ప్రతి విద్యార్థికీ ప్రయోగ శాలల (Laboratories) లో పోషక జలము (Nutrient water) తో నింపబడిన జాడీలలో మొక్కలు పెరుగునను విషయము తెలిసియుండును ఒక జాడీలో (2000 C. C) అర్ధగ్యాలను పరిశుభ్రమయిన నీరు తీసుకొని దానిలో ఒకగ్రాము పొటాశియ నత్రితము, ½ గ్రాము మగ్న (magnesium) గంధకితము, ½ గ్రాము ఖటిక గంధకితము (calcium sulphate) ½ గ్రాము లోహస్ఫురితము (ferrous phosphate) కరిగించవలెను. ఈ ద్రావణములో మొక్కను, సారవంతమయిన నేలలో అదిపెరుగునట్లే, పుష్టిగా పెంచవచ్చును. దీనికే 'వాటర్ కల్చర్' అనిపేరు దీనికి నేలతో నిమిత్తము లేదు. పారిశ్రామికముగా పైర్లు, కూరగాయలు, ఫలములు, పుష్పములు పండించుటకు ఈవిధానము అమెరికాలో అభివృద్ధి చేయబడినది. నేల లేని ఈ వ్యవసాయము వలన అమితముగా టొమాటోలు, కూరగాయలు పండింపబడుచున్నవి. నేడు జలసస్య కృషి (Hydroponics) యని పేరెన్నికగాంచిన ఈ విధానము వ్యవసాయ పద్ధతులలో క్రొత్తయుగము నారంభించుచున్నది.

1936 లో అమెరికాలో ఈ విధానము మొదటసారి ప్రదర్శింపబడినది ఎనిమిది చదరపడుగుల వైశాల్యముగల పీఠముగలిగి, అరడుగుల ఎత్తుగల ఇనుపపెట్టె చూపబడెను. పెట్టెపైన నీటితొట్టి అమర్చబడి యుండెను. పెట్టెలో నాలుగుఅంతస్తులు, ప్రతిఅంతస్తులోను 64 జల్లెడలవలె చిల్లులుగల ట్రే (Tray)లు అమర్చబడి యుండెను. అంతస్తులు, వాటిలో అరలు, ట్రేలు, అన్నీ కళాయిపోత గలవి.

పీఠము పై అరలో ట్రేలన్నియు శుభ్రమైన విత్తులతో నింపెదరు. అవి రోజంతయు పోషక ద్రావణములో నాని మొలకలెత్తును. చిరుత మొలకలుగల ట్రేలన్నీ రెండవ అరలోనికి మార్చబడును. ఈ విధముగా ఒకొక అరలోను మొక్కలు పెరుగుదలలో నొకొక స్థితిలో నుండును

ఈ పంటకు నీరుగట్టుపని (Irrigation) రోజునకు మూడు లేక నాలుగునిమిషములు చేస్తే చాలు. పెట్టెపైభాగముననుండు నీటితొట్టి పోషణద్రావణముతో నింపబడును. దానినుండి కుళాయీలద్వారా ట్రేలమీద తుంపరులు తుంపరులుగా ద్రావణము కురిపింపబడును ఒకఅరనుండి ఇంకొకఅరకు ద్రావణముకురిసి కడపటి అరలో యున్న విత్తుల నాన్చును.

జొన్న ఈ విధముగా పండింపబడినది. జొన్నమొక్కలు బాగా ఎదుగుటేగాక వాటిలో సున్నము. భాస్వరము మున్నగు ధాతువులు మూడు నాలుగు రెట్లధిక మయినవట.

1937 లో డాక్టరు గెరిక్ అనే కాలిఫోర్నియా శాస్త్రవేత్త ఇదే విధానము నుపయోగించి నీటితొట్ల (water proof tanks) లో పోషక లవణ జలమందు టొమాటోలు పండించెను తొట్ల అడుగుభాగము, వెలుతురు రాకుండా చేసెదు, నాచు బూడిద మొదలయిన పదార్థములచే నింపబడి యుండెను. చెట్లు పెరుగుట కవసరమయిన ఉష్ణము, స్టౌ (Stove) తోనో, ద్రావణమున అల్లబడిన తంతులందు విద్యుచ్ఛక్తి పారించుటవల్లనో, ఇవ్వబడును. గెరిక్ సంవత్సరమునకు ఎకరానికి 120 టన్నుల టొమటోపండ్లు పండించియున్నాడు.

'జలసస్యకృషి' వలన ఆర్థికముగా శ్రమ మితము. కూలీ లెక్కువ అవసరములేదు. పంట మంచిరకములో చేరినది. తృప్తికరముగా త్వరలో పైర్లు పండును. ఈవిధానముతో టొమటోలు, బంగాళాదుంపలు, కూరగాయలు, పశువులకు మేత (Fodder) అమితముగా పంటబెట్టవచ్చును. ఎడార్లలో, ఇరాక్, పర్షియా మొదలయిన దేశములలో పచ్చగా కూరగాయలు పండించవచ్చును.

జొన్న, వరి, రాగి మొదలయిన పైర్లు

(19 వ పేజీ తరువాయి)

ఆంధ్రవిద్యార్థి సంసిద్ధుడైయున్నాడు. రెండవ పక్క నేడు మన విద్యావిధానాన్ని గుప్పిట్లో పెట్టుకున్న సి. ఆర్. రెడ్డి, సైప్పు. కొజ శివ రామకృష్ణయ్య వోటి అభివృద్ధి విరోధకులు, ప్రజా వ్యతిరేకులైన జమీందారులు దొంగ వ్యాపారులు, విద్యార్థిపోరాటాలు నెగ్గితే ఆంధ్రదేశములో తమ అస్థిత్వానికే ప్రమాద మని గుర్తించారు భావిపౌరులను తయారు చేసే విద్యాలయాలపై తమఅభివృద్ధి విరోధక పెత్తనం అట్టిపెట్టుకొంటే, తమ ప్రజా పీడనా పరిపాలనకు తోడ్పడే అధికార వర్గాన్ని తయారు చేసు కొన వచ్చునని వీళ్ళ కుట్ర. భావి పౌరులైన విద్యార్థులు ప్రజాస్వామిక సూత్రాలతో విద్యనుపొంది స్వతంత్ర భావాలతో విద్యాలయాలనుండి బయ టకువస్తే ఆంధ్రదేశములో తమకు పుట్టగతులు ఉండవని యీ అభివృద్ధి విరోధక మురాకు తెలుసు అందుకే విద్యార్థి వుద్యమాన్ని నాశ నంచేయ పూనుకున్నారు

ఇంతవరదాకా విద్యార్థి వుద్యమంలోని చీలికలను వుపయోగించుకొని తమ నిర్బంధ విధానాన్ని సాగిస్తూ వస్తుండేవారు కాని నేడు విద్యార్థులలోని ఐక్యత రోజారోజుకు బల పడుతూ వస్తూంది. రాజకీయ విభేదాలను మరచి తమ ప్రాధమికహక్కులకోసం ఆంధ్ర విద్యార్థులు ఐక్యపోరాటాలు జరుపుతున్నారు. ఈ ఐక్యపోరాట తాకిడికి అభివృద్ధివిరోధక విద్యా విధానపు పునాదులు కదిలిపోతున్నాయి. దీనినుండి తమ ప్రాబల్యాన్ని రక్షించుకొను టకు మతద్వేషాలను విద్యాలయాలలోగూడ రెచ్చగొట్టి విద్యార్థుల దృష్టిని విద్యా సంస్క రణలపైనుంచి మళ్లించ చూస్తున్నారు. రైతు కూలీ వుద్యమాలను విచ్ఛిన్నపరచుటకు జమీం దారులు, పెట్టుబడిదారులు, ఆర్ యస్ యస్ ను పోషిస్తున్నట్లే - యీ నిరంకుశ విద్యాలయాధి కారులుగూడ ఆర్ యస్ యస్ సంస్థా నిర్మాత లయ్యారు ప్రభుత్వము విద్యాలయాలలో మత ప్రచారాలను విశేషిస్తూ ఆర్డర్లు జారీచేస్తున్నా యీ నిరంకుశ విద్యాలయాధికారులు - విశ్వ విద్యాలయ వుపాధ్యక్షులైన సి ఆర్. రెడ్డి మొదలు బందరు ప్రిన్సిపాలువరకు, చల్లపల్లి, పిఠాపురం జమీందార్లు,మొదలు చుండూరి రెడ్డి వరకువిద్యాలయాలపైతమ ప్రాబల్యాలనట్టిపెట్టు కొనుటకు విద్యార్థి వుద్యమాన్ని నాశనంచేయు టకు, ఆర్ యస్. యస్ ను ప్రోత్సహించు చున్నారు. వీరి పలుకుబడినంతా యీ సంస్థా వ్యాప్తికి వుపయోగించుచున్నారు. మరియొక ప్రక్క రాయలసీమ - సర్కారు విభేదాలను విద్యార్థులలో రెచ్చగొట్టి విద్యార్థి ఐక్యతను అసాధ్యముచేయ చూస్తున్నారు.

ఆంధ్ర విద్యార్థులపై నేడు కేంద్రీకరించిన యీ నిర్బంధవిధానం ఒకవిద్యార్థి వుద్యమాన్నే కాదు దెబ్బకొట్టేది ఆంధ్ర జాతీయవికాసానికి, ఆంధ్ర అభివృద్ధికి కృషిచేసే ప్రతి వుద్యమంపై కూడ యిది దండయాత్రే. దేశంలో ప్రజా స్వామిక విద్యావిధానం అమలుపర్చడంగాని, జమీందారీ విధానాన్ని రద్దుపరచి, రైతు హక్కులను గుర్తించటంగాని, పరిశ్రమలను జాతిపరం చేయటంగాని జరగదు ఆంధ్ర విద్యార్థి వుద్యమంపై పెట్టుబడిదార్లకు, జమీందార్లకు ఆధిక్యత వున్నంతకాలము, ఆంధ్ర ఆర్థికవిధానంపైనే

(మిగతా 24 వ పేజీలో)

ఈవిధానముతో పలించువరకు వాణిజ్యరీత్యా పండింపక బోయినను రైతు తన పశువులకు మేత నిర్లక్ష్యముగా వేయ పీలుండును. ఆహార మీవిధముగా పండించుటకు ఆర్థికముగా సరళ మయిన యెడల రేపటిపౌరులు ప్రతియొకరు తమతిండి పదార్థములు తామే పండించు కొన వచ్చును

పొలములులేని పంటలు, నేలలేని తోటలు, ఇదిజలసస్యకృషిజూపే భవిష్యము. మనదేశపు రైతులకు చేత ఎరువులు వాడటం సామాన్య మయినా వాటి విలువలు తెలియవు. పంట స్వభావము, నేలతరహా తెలిసిననే, అనుకూల మయిన రసాయనద్రవ్యము వేయవలెను. దీనికి రైతురసాయనికుల (Chemsits)సలహా పుచ్చుకొనవలెను. వ్యవసాయ శాఖోద్యోగికి సేద్యములో ననుభవము చాలమితము అతని సలహాలు తీసికొని అమలులో బెట్టుటకు రైతుకు విజ్ఞానము శూన్యము. ఈ సమస్య రైతు ఆధునిక వ్యవసాయ శాస్త్రమున పాండి త్యము సంపాదించువరకు తీరదేమో రైతాం గము బాగుపడుటకు వారి విజ్ఞానమును పెంపొం దించవలెను. సమిష్టివ్యవసాయము, యాంత్రిక వ్యవసాయము అలవడ వలెను. భావిభారత నాయకులు వ్యవసాయ పద్ధతులలో సంపూర్ణ విప్లవము గొనివచ్చి భారతదేశము నిత్యకళ్యా ణము, పచ్చతోరణము కలదిగా చేసెదరా? అమెరికా, రష్యా మొదలయిన దేశములతో పోల్చదగిన సౌభాగ్యము భారత దేశము న కెన్నడు కల్గునోకదా!

(21 వ పేజీ తరువాయి)

రామా : ఎక్కడవృద్ధి, వెధవకు చదువు
పడవాల్సి వచ్చె-ఇంట్లో పనులు
పట్టాయటరా! చమడాల్ ఒలిచే
వాళ్ళేక. (చేతికర్రతో కొట్టబోగా)

బాల : ఎందుకు నాన్నా సుబ్బయ్యను
కొట్టేది? సుబ్బయ్య చదువుకో
గూడదూ?

రామా : చదివాడులే. చదువుతూ
కూర్చుంటే వీడి తాత గాడెవడు
చెస్తాడీపని? తింటానికి తిండిలేక
పోయినా - తెలివి తేటలుమెండు
ముండకు. పోరాగాడ్దె - నిల్చొని
గుడ్లు మిటకరిస్తూ చూస్తావేం?
(కొట్టబోగా)

సుబ్బ : (ప్రక్కకు ఒరుగును)

బాల అమ్మా! అమ్మా! నాన్న
సుబ్బయ్యను కొడుతున్నాడే రావే,
రావే. (అనిగోలచేస్తుంది).

రామా : (చెవులు మూసుకొని) ఇస్
అబ్బబ్బా. ఏమిటీ రాక్షసిరొద.

బాల : (అరుస్తూనే వుంటుంది)

కమల : (ప్రవేశించి)ఏమిటండీ ఈగోలం
తాను.

బాల : చూడవే అమ్మా. సుబ్బయ్య
చదువుకుంటుంటే కొట్టబోతున్నాడే
నాన్న. (అంటూ అమ్మను చేయి
పట్టుకొనును.)

కమల : ఎందుకండి వాణ్ణి కొట్టేది,
పని లేనప్పుడు చదువుకోగూడదూ.
మరీని...

రామా : మరిగిరీని. అఘోరించితీర్పు
చెప్పొచ్చావు. పద పద కొంపకు
దొరికారు. (అని లోనికి పోతాడు.
సుబ్బయ్య మరోవైపుపోతుంటాడు.
బాల సుబ్బయ్యవైపు చూస్తూ
పోతుంది. [తెర]

(సశేషము)

భీమవరం మహాసభలకు వెళ్లుట మహాపరాధమైంది

భీమవరంలో జరిగిన రాష్ట్ర విద్యార్థిమహాసభకు తూ. గో. జిల్లా రాజోలునుండి శ్రీమతి సరోజిని, మేరీగార్లు ప్రతినిధులుగా వచ్చారు. వీరు అచ్చట గొల్ల చంద్రయ్యగారి ఆధిపత్యం క్రింద నడుస్తున్న హాస్టలులో ఉంటూ మహాసభ తేదీలలో హాస్టలుకు సెలవుపెట్టి వారి ఇంటికివెళ్ళి, తల్లిదండ్రుల అంగీకారంతో మహాసభకు వచ్చారు ఇది పాపం! ఆ హాస్టలు మేనేజరుగారికి కిట్టలేదు. వారు తిరిగి రాగానే, "మీరు నా అనుజ్ఞ లేకుండా మహాసభలకు ఎందుకు వెళ్ళారు, దానికి క్షమాపణ ఇమ్మని నిర్బంధించారు దానికి మా తలిదండ్రుల అనుజ్ఞతో మేము మహాసభలకు వెళ్ళామని, దానికి మీరు దౌర్జన్యం చేయుట న్యాయంకాదని సరోజిని అడుగగా, దానికి ప్రతిఫలంగా రెండు దినములు తిండి లేకుండా మాడ్చాడు, ఆమె అన్నగారు ఈ "హరిజన శ్రేయోభిలాషి"తో మాట్లాడుటకు వెళ్ళినపుడు అసభ్యంగా ప్రవర్తించాడు తరువాత తాలూకా విద్యార్థిసంఘం తరపున ఒక రాయబారవర్గం వెళ్ళగా, దాని ఎడలకూడ చాల అసభ్యంగా ప్రవర్తించాడు

ఈ విధంగా అనేకమంది విద్యార్థుల జీవితాలను నాశనంచేయ సమకట్టాడు. పైగా తాను "హరిజన సేవకుణ్ని"అనిచెప్పుకొంటున్నాడు. కాబట్టి అధికారులు, ప్రజలు కలిసి ఈ మేనేజరు చంద్రయ్యగారి దురాగతాలను అరికట్టాలని కోరుతున్నాం.

స్వీకారం

(1) ఏకదేశం } రెండు నాటకాలు రచన.
(2) న్యాయం } కొండముది గోపాలరాయశర్మ

గెలుపు మనదే (కథల సంపుటి)

రచన. పర్చా దుర్గాప్రసాదరావు

పై పుస్తకాలు మా కార్యాలయం చేరాయి. వాటిపై సమీక్ష వచ్చే సంచికలో వస్తుంది.

కిసాన్

రాజమండ్రి కార్యస్థానంగా ప్రథమ సంచిక వెలువడింది. మాసపత్రిక, రైతు సమస్యలకు ప్రాధాన్యమిచ్చే పత్రిక. దంతలూరి గోపీచందుగారి సంపాదకత్వాన ప్రారంభమయింది. సంపాదకులు సంపాదకీయంలో తెలియజేసినట్లు 'సోదర పత్రికలతో చేతులు కలిపి రైతు కూలీల పురోభివృద్ధికి కృషిచేయడమే' లక్ష్యముగా పెట్టుకున్న 'కిసాన్' వాంఛితం నెరవేరాలని ఆశిస్తాం.

అవీ-ఇవీ

రాజమండ్రి పట్టణ ద్వితీయ యువజన మహాసభ

నవంబరు 15 వ తేదీన రాజమండ్రి పట్టణ యువజన ప్రతినిధుల ద్వితీయమహాసభ కృష్ణారావు పేటలో జరిగింది. శ్రీ అయ్యగారి నరసింహారావుగారు అధ్యక్షత వహించారు. అన్ని పేటలనుంచీ 66 గురు ప్రతినిధులు వచ్చారు.

ప్రతినిధులు వివిధజాతీయ, అంతర్జాతీయ సమస్యలపై 18 తీర్మానాలు సమగ్రంగా చర్చించి ఆమోదించారు ఇందులో ఆర్. యస్. యస్.'పై శ్రీ ఎ మాణిక్యాలరావు గారు ప్రవేశపెట్టిన తీర్మానం ప్రతినిధులనెక్కువ ఉత్సాహపరిచింది. తీర్మానంపై 1½ గంట చర్చజరిగింది, 8 సవరణలతో యువకుల బాధ్యతలను వివరిస్తూ ప్రతినిధులు మాట్లాడారు. ఆర్. యస్. యస్ లో చేరిన ఇద్దరు యువకులు (నేడు యువజన సంఘంలో సభ్యులు) ఆమతసంస్థ కుతంత్రాలను వివరించారు. తీవ్రమైన చర్చ పిదప తీర్మానం ఆమోదించారు.

మహాసభపై ఒక కృష్ణారావుపేట పౌరుడు ఇలా అన్నాడు "ప్రజాసమస్యలపై యువజన సంఘాలు చక్కగా పనిచేస్తున్నాయి, మన వాళ్ళందరినీ ఇందులో చేర్చాలి".

మహాసభకు కొత్తపేట యువజనసంఘం వైజ్ఞానిక ప్రదర్శనాలద్వారా 25-10-0 వసూలు చేసి, యువకపతాక బహుమతి పొందింది. శ్రీ రావీన ఆదెయ్యగారు 10 రూ॥లు విరాళమిచ్చారు. నూతనసంవత్సరానికి

అధ్యక్షులు ఎ. మాణిక్యాలరావు. ఉపాధ్యక్షులు జి. సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి సి వి ఆర్. ప్రసాద్, సహాయకార్యదర్శి పి. వీరన్న గార్లతో 13 గ్గురు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

Printed and Edited by
A. K. R. B Koteswara Rao
at Prajasakti Press
Mogalrajapuram, Bezwada
Published by
K Advita Parabrahma Sastri, B A
from Navayuga office,
Main Road, Kottapeta, Guntur

యువజన ఫెడరేషన్ సభ్యులు వరికోతలు కోయండి

కామ్రేడ్స్,

మనం ప్రథమంగా 'ఆంధ్ర యువజన ఫెడరేషన్' ఏర్పర్చుకున్నాం. జాతీయ పునర్నిర్మాణంలో మనబాధ్యతలను నిర్వర్తించాలన్నా స్వతంత్ర భారత దేశంలో కుతంత్ర శక్తుల కుట్రల నరిట్టాలన్నా, మనం గమ్యస్థానం చేరుకోవాలన్నా మన సంఘ కార్యక్రమం నిత్యం తీవ్రతరంకావాలి, ఆర్థికంగా మనసంస్థ స్వయం పోషకంగా ఉంటేనే మన సంస్థ సర్వతో ముఖాభివృద్ధి పొందుతుంది ఇందుకు ఒకమార్గంగా సాంప్రదాయాను గతంగావస్తున్న 'వరి కోతల' కార్యక్రమాన్ని ఈ సంవత్సరం మనం మరింత ముందుకు తీసుకుపోవాలి. దీనికి స్థానిక సంఘాలు ప్లానులువేసి వెంటనే వరి కోతల కార్యక్రమాని కుపక్రమించాలి. తాలూకాల బాధ్యులతామే స్వయంగా చొరవ తీసుకొని కొన్ని ప్రధాన గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని అమలు జరపాలి వెంటనే మీరెంత కోసిందీ రిపోర్టు, డబ్బూ రాష్ట్ర ఆఫీసుకు పంపాలి ఫోటోలకోసం అనవసరంగా డబ్బు ఖర్చుపెట్టరాదు బాల్యదశలో ఉన్న మన సంఘాన్ని పోషించటానికి యువకులంతానడుం కట్టాలని కోరుతున్నాం.

ఇట్లు,

ఆంధ్ర యువజన ఫెడరేషన్

(23 వ పేజీ తరువాయి)

యీ మతాలకు ఆధిక్యత వుంటుంది. మన సమాజంపై యీదోపిడీగాంద్రకున్న పెత్తనాన్ని తుడిచిపెట్టుటకు ప్రజాస్వామికోద్యమాలన్నీ సమన్వయమైన కార్యక్రమముతో కృషి చేయాలి. అందుకు వీరోచితంగా పోరాడుతున్న గుంటూరు విద్యార్థుల పోరాటమును ప్రతి ఆంధ్రుడూ బలపర్చాలి ప్రభుత్వము తన అభివృద్ధివిరోధక పంథాను వదలి విద్యాసంస్కరణలను ప్రవేశపెట్టమని ఎలుగెత్తిచాటాలి. విద్యార్థులపై పోలీసు ప్రయోగాన్ని ఖండించాలి. గ్రామగ్రామాన సభలు, ప్రదర్శనలుచేసి తమ ప్రస్తుత వైఖరిని విశ్వవిద్యాలయము. మద్రాసు ప్రభుత్వము మార్చుకొనేటట్లు వత్తిడిచేయాలి. అప్పుడే మనం కోరే ప్రజాస్వామిక జాతీయ విద్యావిధానం సాధించగల్గుతాం. ఆంధ్ర జాతీయ సాంప్రదాయాలలో మన విద్యార్థులకు, విద్య గరుప గలుగుతాం, స్వతంత్ర భారత జాతులలో మెప్పుపొందే నూతన ఆంధ్రజాతిని నిర్మించగల్గుతాం. (ఈ వ్యాసం సమ్మె జరుగుతున్నరోజుల్లో వ్రాయబడింది)